ప్రజాశక్తి

ఆదివారం 21 సెప్టెంబర్ 2025 8 పేజీలు




ప్రకాశం బాపట్ల

అంగన్‌వాడీల పోరాటం

భవిష్యత్ ఉద్యమాలకు స్ఫూర్తి

- హక్కుల కోసం మరో ఉద్యమం
- అంగన్‌వాడీ వర్కర్స్ జాతీయ ప్రధాన కార్యదర్శి ఎఆర్. సింధు
- ఉత్సాహంగా రాష్ట్ర మహాసభలు ప్రారంభం



మాట్లాడుతున్న డాక్టర్ ఉదయిని

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

అంగన్‌వాడీల పోరాటం చేసి సాధించిన విజయాలు భవిష్యత్ పోరాటాలకు స్ఫూర్తిగా నిలుస్తాయని ఆల్ ఇండియా ఫెడరేషన్ ఆఫ్ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ జాతీయ ప్రధాన కార్యదర్శి ఎఆర్. సింధు తెలిపారు. ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ 11వ రాష్ట్ర మహాసభలు ఒంగోలు కాపు కళ్యాణ మండపంలో రాష్ట్ర అధ్యక్షురాలు జి.బేబీ రాణి అధ్యక్షతన ఉత్తేజభరితంగా శనివారం ప్రారంభమయ్యాయి. ప్రారంభ సభలో సింధు మాట్లాడుతూ గత మూడేళ్లలో ఆంధ్రప్రదేశ్ అంగన్‌వాడీలు చేపట్టిన ఉద్యమం అనేక విజయాలు సాధించి భవిష్యత్ పోరాటాలకు దిశానిర్దేశం చేసిందని అభినందించారు. ఎస్మా లాంటి నిర్బంధాల మధ్య 42 రోజుల పాటు మెలిటెంట్ పోరాటం కొనసాగించిన స్ఫూర్తి ఆదర్శప్రాయమన్నారు. ఫలితంగా అనేక జీవోలు సాధించారని గుర్తుచేశారు. జులై 9న గుజరాత్‌లో అంగన్‌వాడీల ఆందోళన ఫలితంగా వర్కర్స్‌కు రూ.26 వేలు, హెల్పర్స్‌కు రూ.20 వేల వేతనాలు, కోర్టు ద్వారా గ్రాడ్యుటీ సాధించడం పోరాట స్ఫూర్తికి నిదర్శనమన్నారు. కనీస వేతనం, ఉద్యోగ భద్రత, పెన్షను అంశాల్లో అంగన్‌వాడీలు ఇప్పటికీ తీవ్ర కష్టాలు పడుతున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. 2014 నుంచి మోడీ ప్రభుత్వం వేతనాలు పెంచలేదన్నారు. ఐసిడిఎస్‌ను నిర్వీర్యం చేసే విధానాలు అమలు చేస్తోందని విమర్శించారు. ఎఫ్ఆర్ఎస్, ఒటిపి నిబంధనల వలల్ల పౌష్టికాహారం పంపిణీ ఇబ్బందికరమన్నారు. ప్రతి ఏడాది బడ్జెట్‌లో పౌష్టికాహారానికి కోతలు విధిస్తూ ఐసిడిఎస్‌ను అణగదొక్కుతున్నారన్నారు. కేవలం ఎనిమిది రూపాయలతో పౌష్టికాహారం ఎలా అందిస్తారో మోడీ సమాధానం చెప్పాలని నిలదీశారు. మోడీ జన్మదిన వేడుకల పేరుతో

2లో



జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

అంగన్‌వాడీల పోరాటం..
భవిష్యత్ ఉద్యమాలకు స్ఫూర్తి

(మొదటిపేజీ తరువాయి)

పోషణ్ మాసోత్సవం నిర్వహించాలని ఆదేశించడం, ఫొటోలు అప్‌లోడ్ చేయాలని చెప్పడం ఆమె నిరసన వ్యక్తం చేశారు. మోడీ ప్రభుత్వ విధానాలు కేవలం అంగన్‌వాడీలే కాక, అన్నివర్గాల ప్రజలు, ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. కులం, మతం పేరుతో జాతీయతను దెబ్బతీస్తున్న మోడీ ప్రభుత్వాన్ని అంగన్‌వాడీలు, కార్మిక, కర్షక, ఉద్యోగులు ఐక్యతతో ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. అక్టోబర్ 7,8 తేదీల్లో నిర్వహిస్తున్న 50 ఏళ్ల అంగన్‌వాడీ స్వర్ణోత్సవాలు, 30 ఏళ్ల మిడ్‌డే మీల్ వర్కర్స్, 20 ఏళ్ల ఆశా వర్కర్స్ మహాసభల్లో అంగన్‌వాడీలు నాయకత్వం వహించాలని కోరారు. విశాఖపట్నంలో నిర్వహించనున్న రాష్ట్ర మహాసభల్లోనూ అంగన్‌వాడీలు ప్రధాన శక్తిగా నిలవాలని ఆమె పిలుపునిచ్చారు.

మోడీ చర్యలను తిప్పికొట్టాలి: కెఎస్. లక్ష్మణరావు

శాసనమండలి మాజీ సభ్యులు కెఎస్. లక్ష్మణరావు మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని ఉద్యమాలకు అంగన్‌వాడీలు స్ఫూర్తిగా నిలిచారన్నారు. మానవాభివృద్ధిలో కీలకమైన ఐసిడిఎస్‌ను నిర్వీర్యం చేసేందుకు మోడీ కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు. ఆర్థికాభివద్ధి పేరుతో మానవాభివద్ధి అవసరాలను విస్మరించడం దారుణమన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలను ప్రైవేట్ రంగానికి అప్పగించే ప్రయత్నాలు అక్షేపణీయమని విమర్శించారు. రాజ్యాంగం ప్రకారం ప్రభుత్వాలే శిశు మరణాలు తగ్గించాలన్నారు.గర్భిణులకు పోషకాహారం అందించాలని గుర్తు చేశారు. రికార్డు స్థాయిలో 42 రోజులు నిర్భంధాన్ని ఎదుర్కొని విజయాలు సాధించిన అంగన్‌వాడీలు వేతన పెంపు, పెన్షన్, రూ.5 లక్షల గ్రాడ్యుటీ లాంటి హక్కుల కోసం మరో ఉద్యమం చేపట్టాలని పిలుపునిచ్చారు. ఆహ్వాన సంఘ ప్రతినిధి, ప్రముఖ వైద్యులు డాక్టర్ ఎం.ఉదయిని మాట్లాడుతూ మహిళ లపై ఎక్కడా లేని వివక్షత భారతదేశంలో కొనసాగడం అత్యంత ఆందోళన కరమన్నారు. దీపికా పదుకునే లాంటి సెలబ్రిటీలకు కూడా వివక్షత తప్పడం లేదంటే స్త్రీల పట్ల పాలకుల నిర్లక్ష్యం ఏ స్థాయిలో ఉందో అర్థం అవుతుందన్నారు. రాజ్యాంగం కల్పించిన ఏ చట్టం కూడా దేశంలో అమలుకు నోచుకోకపోవడం దారుణమన్నారు. శిశు సంరక్షణ, విద్య, వైద్యం,స్త్రీ శిశు సంక్షేమం పట్ల ప్రభుత్వాలుఉదాసీనంగా వ్యవహరిస్తున్నాయని దుయ్యబట్టారు. స్త్రీ సంక్షేమం, సంరక్షణలో అంగన్‌వాడీల పాత్ర అనిర్వచనీయమని ప్రశంశించారు.

తొలుత మహాసభల ప్రారంభం సందర్భంగా రాష్ట్ర అధ్యక్షురాలు జి.బేబీ రాణి సంఘ పతాకాన్ని ఎగురవేశారు. సభలో ఇటీవల మరణించిన నేతలకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కారుసాల సుబ్బరావమ్మ, సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్. నరసింగరావు, ఉపాధ్యక్షుడు వి.ఉమామహేశ్వరరావు, కార్యదర్శులు కె.ఉమామహేశ్వరరావు, కె.ధనలక్ష్మి, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కాలం సుబ్బారావు, ఎం.రమేష్, జిల్లా కార్యదర్శి గంటెనపల్లి శ్రీనివాసులు, ఉపాధ్యక్షులు జివి.కొండారెడ్డి, చీకటి శ్రీనివాసరావు, సంఘ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వై.సత్యవతి, ఈదర అన్నపూర్ణ, కెవి.సుబ్బమ్మ పాల్గొన్నారు.

బల్క్‌డ్రగ్ మాన్యుఫ్యాక్చర్స్‌అసోసియేషన్
సహాయ కార్యదర్శిగా డాక్టర్ ఏలూరి

ప్రజాశక్తి-మార్కాపురం




బల్క్‌డ్రగ్ సమావేశంలో డాక్టర్ ఏలూరి

దేశంలో ప్రఖ్యాతిగాంచిన బల్క్ డ్రగ్ మాన్యుఫ్యాక్చర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (బిడిఎమ్ఎఐ) జాతీయ సహాయ కార్యదర్శిగా ఎస్ఆర్‌సి లాబొరేటరీస్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మార్కాపురం ప్రాంతవాసి డాక్టర్ ఏలూరికి అరుదైన అవకాశం దక్కింది. అసోసియేషన్ 34వ జనరల్ బాడీ సమావేశం హైదరాబాద్‌లోని గ్రాండ్ కాకతీయ హోటల్ శనివారం జరిగింది. దేశంలోని అన్ని రాష్ట్రాల నుంచి 'బిడిఎమ్ఎఐ' ప్రతినిధులు హాజరయ్యారు. భారత దేశానికి చెందిన బల్క్ డ్రగ్ మాన్యుఫ్యాక్చర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియాకు అంతర్జాతీయంగా పేరు ప్రఖ్యాతలు ఉన్నాయి. డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి ఫార్మా రంగం ద్వారా అనేక సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్న విషయం తెలిసిందే. కరోనా విపత్కర పరిస్థితుల్లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌తో పాటు కర్ణాటక రాష్ట్రంలోనూ బాధితులకు ఉచితంగా మెడిసిన్, మాస్కులు, శానిటైజర్ తదితర వైద్య సామగ్రిని అందించారు. కోవిడ్ సమయంలో డాక్టర్ రామచంద్రారెడ్డి మానవత్వంతో అందించిన సేవలను వివిధ రాష్ట్రాల ప్రభుత్వాలు ప్రశంసించడం విశేషం. బల్క్ డ్రగ్ అసోసియేషన్ జాతీయ సహాయ కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికయిన డాక్టర్ ఏలూరిని పలు ఫార్మా కంపెనీల ప్రతినిధులు అభినందించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి మాట్లాడారు. అంతర్జాతీయంగా పేరొందిన బల్క్ డ్రగ్ అసోసియేషన్‌కు సహాయ కార్యదర్శిగా ఎన్నుకున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఫార్మా రంగం అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు.

డివిజన్ స్థాయి పోటీలకు...
మోడల్ స్కూల్ విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి-పెద్దదోర్నాల


డివిజన్ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

పెద్దదోర్నాలలో ఎస్‌జిఎఫ్ ఆధ్వర్యంలో మండల స్థాయిలో క్రీడా పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో మోట్ల (మల్లికార్జునపురం) వద్దగల మోడల్ స్కూల్ విద్యార్థులు రాణించారు. డివిజన్ స్థాయిలో నిర్వహించే పోటీలకు ఎంపికయ్యారు. ఆ పాఠశాలలో శనివారం ప్రత్యేక అభినందన కార్యక్రమం జరిగింది. విజేతలను అభినందించారు. డివిజన్ స్థాయిలోనూ రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఆంజనేయులు, పిడి సిద్దు, ఇన్‌చార్జి విష్ణువర్ధన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రోడ్డు మార్జిన్‌ను ఆక్రమిస్తే చర్యలు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం


తోపుడు బండ్లను తొలగింపజేస్తున్న పోలీసులు

ప్రధాన రహదారిపై రోడ్డుకు ఇరువైపులా స్థలాన్ని ఆక్రమించి వ్యాపారాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని సిఐ సిహెచ్ ప్రభాకరరావు హెచ్చరించారు. జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు శనివారం యర్రగొండపాలెం పట్టణంలోని మార్కాపురం, వినుకొండ రహదారుల్లో రోడ్డు మార్జిన్ స్థలాన్ని ఆక్రమించి చిరు వ్యాపారాలు, తోపుడు బండ్లు నిలిపి వ్యాపారులు నిర్వహిస్తున్న వారితో మాట్లాడారు. ఫుట్‌పాత్‌కు అవతల వైపు మాత్రమే పెట్టుకొని వ్యాపారాలు చేసుకోవాలి కానీ ఫుట్‌పాత్‌లను ఆక్రమించి వాహనదారులను, ప్రజలను ఇబ్బంది పెట్టి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే ఉపేక్షించేది లేదని అన్నారు. పట్టణంలో రోజురోజుకూ పెరుగుతున్న జనాభాను దృష్టిలో పెట్టుకొని ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా చర్యలు చేపట్టినట్లు ఆయన తెలిపారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న వ్యాపార సముదాయాలకు సంబంధించిన మెట్లు, షెడ్లపై దుకాణాలు పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలు చేసుకునే వారు స్వచ్ఛందంగా తొలగించుకోవాలన్నారు. లేదంటే పంచాయతీ సిబ్బంది చేత వాటిని తొలగించి చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మహారాజశ్రీ
మార్కాపురం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఇ.పి. 15/2025
ఇన్
ఓ.ఎస్. 29/2015

బచ్చు శ్రీనివాసరావు .... డి.హెచ్.ఆర్.
వర్సెస్
శింగరి రామయ్య .... జె.డి.ఆర్.

టు,
జె.డి.ఆర్: శింగరి రామయ్య,
తండ్రి: వెంకటసుబ్బయ్య
నివాసం: బంగారమ్మ గుడి ఎదురుగా,
తూర్పువీధి, మార్కాపురం టౌన్ మరియు మండలం,
ప్రకాశం జిల్లా.

పై నెంబరు ఇ.పి.లో మీకు ఆర్డర్ 21 రూల్ 22 సి.పి.సి. నోటీసులు ముట్టని కారణంగా కోర్టు వారు పేపరు ప్రకటన కొరకు ఉత్తర్వులు జారీ చేసినారు. కావున తేదీ: 07-10-2025న వాయిదా ఉన్నది. ఆ రోజు ఉదయం 10:30 గంటలకు పై కోర్టులో మీరు స్వయముగా లేదా మీ తరపు వకీలు ద్వారా గానీ హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమందు కేసు తీర్మానించబడును.

// కోర్టు వారి ఉత్తర్వులతో //

వాయిదా: 07-10-2025

ఇ.శారద,
అడ్వకేట్, మార్కాపురం.

మహారాజశ్రీ అద్దంకి ప్రిన్సిపల్ సివిల్ జడ్జి
(జూనియర్ డివిజన్) గారి కోర్టులో
O.S.No.192/2024

కంభంపాటి బూషి @ నాగ భూషణం .....వాది
Vs.
గుంజి గంగయ్య ....ప్రతివాది

ప్రకటన

To:
ప్రతివాది
గుంజి గంగయ్య S/o నాగేశ్వరరావు
డోరు నెంబరు: 4-64, కొప్పరం గ్రామం,
బల్లికురవ మండలం, బాపట్ల జిల్లా.

పై దావాలో మీకు ఎన్నిసార్లు దావా సమన్లు పంపినప్పటికి మీరు దురుద్దేశ్యపూర్వకముగా తీసుకొనక తిరిగి పంపుచున్నందువలన మీకు పై నంబరు దావాలో నోటీసును ఈ ప్రకటన ద్వారా కోర్టువారు జారీ చేసి మీ హాజరు నిమిత్తం ఈ దావాను తేది. 22-09-2025నకు వాయిదా వేశారు. కావున మీరు ఆ తేదిన ఉదయం గం.10-30 ని.లకు పై కోర్టువారి ఏదుట స్వయముగాగానీ, వకీలు ద్వారాగానీ హాజరై పైదావాలో మీ ఆక్షేపణలను తెలియజేయవలెను. లేని ఏడల పై దావాను మీ పరోక్షమందు తీర్మానించదరని తెలియ జేయడమయినది.

// శ్రీ కోర్టువారి ఉత్తర్వులతో //

వజ్రాల అంజిరెడ్డి,
మారం శ్రీనివాసరావు,
తాడికొండ ప్రసాద్ బాబు,
వాది తరపు న్యాయవాదులు

మహారాజశ్రీ
మార్కాపురం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఇ.పి. 17/2025
ఇన్
ఓ.ఎస్. 101/2014

1) శింగరి లింగయ్య (చనిపోయినందున వారసులు)
2) శింగరి సుబ్రమణ్యం మరియు ఇతరులు
..... డి.హెచ్.ఆర్స్
వర్సెస్
శింగరి రామయ్య .... జె.డి.ఆర్.

టు,
జె.డి.ఆర్: శింగరి రామయ్య,
తండ్రి: వెంకటసుబ్బయ్య
నివాసం: బంగారమ్మ గుడి ఎదురుగా,
తూర్పువీధి, మార్కాపురం టౌన్ మరియు మండలం,
ప్రకాశం జిల్లా.

పై నెంబరు ఇ.పి.లో మీకు ఆర్డర్ 21 రూల్ 22 సి.పి.సి. నోటీసులు ముట్టని కారణంగా కోర్టు వారు పేపరు ప్రకటన కొరకు ఉత్తర్వులు జారీ చేసినారు. కావున తేదీ: 07-10-2025న వాయిదా ఉన్నది. ఆరోజు ఉదయం 10:30 గంటలకు పై కోర్టులో మీరు స్వయముగా లేదా మీ తరపు వకీలు ద్వారా గానీ హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమందు కేసు తీర్మానించబడును.

// కోర్టు వారి ఉత్తర్వులతో //

వాయిదా: 07-10-2025

ఇ.శారద,
అడ్వకేట్, మార్కాపురం.

నోటీసు
మహారాజశ్రీ
మార్కాపురం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
క్రెడిటర్ ఐ.పి. నెం: 6/25

లగిశెట్టి అరుణ్‌కుమార్ ... పిటీషనర్
వర్సెస్
యాతం కోటిరెడ్డి మరియు ఇతరులు.. రెస్పాండెంట్స్

టు,
1. యాతం కోటిరెడ్డి, తండ్రి: గాలిరెడ్డి
డోర్ నెం: 10/104/జి/69/సి, జవహర్‌నగర్ కాలనీ,
మార్కాపురం పట్టణం, మార్కాపురం మండలం,
ప్రకాశం జిల్లా. **(ఆర్-1)**
2. యాతం నాగ మల్లేశ్వరి, భర్త: కోటిరెడ్డి,
డోర్ నెం: 10/104/జి/69/సి, జవహర్‌నగర్ కాలనీ,
మార్కాపురం పట్టణం, మార్కాపురం మండలం,
ప్రకాశం జిల్లా. **(ఆర్-2)**
3. యాతం సాయినాథరెడ్డి, తండ్రి: కోటిరెడ్డి,
తండ్రి: గాలిరెడ్డి, డోర్ నెం: 10/104/జి/69/సి,
జవహర్‌నగర్ కాలనీ, మార్కాపురం పట్టణం,
మార్కాపురం మండలం, ప్రకాశం జిల్లా. (ఆర్3)

పైనెంబరు ఐ.పి.లోని 1వ రెస్పాండెంట్ అనగా యాతం కోటిరెడ్డి పిటీషనరుకు ప్రామిసరి నోటు బాకీ చెల్లించనందున, ఐ.పి. షెడ్యూల్ ఆస్తుల గురించి 2వ రెస్పాండెంట్ పేర స్థిరాస్తి దాఖలు రిజిష్టర్ దస్తావేజు వ్రాయించి ఇచ్చి ఉన్నందున, దానిని రద్దు చేయమని మరియు 1వ రెస్పాండెంట్‌ను ఇన్సాల్వెంట్‌గా డిక్లర్ చేయమని కోరుతూ పిటీషనర్ పై కోర్టులో, పై నెంబరు క్రెడిటర్ ఐ.పి. పిటీషన్‌ను దాఖలు చేసినందున, ఇందు విషయము మీకు పలుమార్లు నోటీసులు పంపగా, అవి మీకు ముట్టని కారణం చేత ఈ దినపత్రిక నోటీస్ ద్వారా మీకు తెలియజేయునది ఏమనగా 06-10- 2025వ తేదీన ఉదయం 10:30 గంటలకు పైకోర్టులో మీరు స్వయముగా లేదా అడ్వకేట్ ద్వారా గానీ హాజరై మీకు ఏమైనా ఆక్షేపణలు ఉన్న యెడల తెలియజేసుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమందు ఐ.పి. విచారించి తీర్మానించబడును.

// కోర్టు వారి ఉత్తర్వులతో //

వాయిదా: 06-10-2025

తొమ్మండ్రు హరికృష్ణ
పిటీషనర్ తరపు అడ్వకేట్
మార్కాపురం.

మహారాజశ్రీ
మార్కాపురం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఇ.పి. 16/2025
ఇన్
ఓ.ఎస్. 102/2014

ముచ్చర్ల వెంకట చెన్నయ్య .... డి.హెచ్.ఆర్.
వర్సెస్
శింగరి రామయ్య .... జె.డి.ఆర్.

టు,
జె.డి.ఆర్: శింగరి రామయ్య,
తండ్రి: వెంకటసుబ్బయ్య
నివాసం: బంగారమ్మ గుడి ఎదురుగా, తూర్పువీధి,
మార్కాపురం టౌన్ మరియు మండలం, ప్రకాశం జిల్లా.

పై నెంబరు ఇ.పి.లో మీకు ఆర్డర్ 21 రూల్ 22 సి.పి.సి. నోటీసులు ముట్టని కారణంగా కోర్టు వారు పేపరు ప్రకటన కొరకు ఉత్తర్వులు జారీ చేసినారు. కావున తేదీ: 07-10-2025న వాయిదా ఉన్నది. ఆ రోజు ఉదయం 10:30 గంటలకు పై కోర్టులో మీరు స్వయముగా లేదా మీ తరపు వకీలు ద్వారా గానీ హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమందు కేసు తీర్మానించబడును.

// కోర్టు వారి ఉత్తర్వులతో //

వాయిదా: 07-10-2025

ఇ.శారద,
అడ్వకేట్, మార్కాపురం.

మహారాజ శ్రీ ఒంగోలు 3వ అదనపు జిల్లా జడ్జివారి కోర్టులో
O.S.No.65/2024

గుడ్లూరు మల్లిఖార్జున .....వాది
మరియు
కొంచా రాజ్యలక్ష్మీ .....ప్రతివాది

To
ప్రతివాది :
Koncha Rajyalakshmi wife of Koncha Krishna Reddy, Hindu, aged 45 years, business, R/o.Door No.7-556/1-2, Gandhi Nagar, Chimakurthy Town-523226, Praksam District.

పై నంబరు దావా, వాది నీమీద కోర్టులో దావా దాఖలు చేసియున్నందున ఈ కేసులో మీకు నోటీసు నిమిత్తం అనేక పర్యాయాలు రిజిష్టరు పోస్టుద్వారా మరియు కోర్టుద్వారా నోటీసులు పంపిననూ తీసుకొనక కాలయాపనచేయు చున్నందున ,కోర్టువారి వుత్తర్వుల ప్రకారం ఈ పేపరు ద్వారా మీకు నోటీసులు పంపడమైనది. కావున మీరు 13-10-2025వ తేదీన పై కోర్టువారి ఎదుట ఉదయం 10-30 గంటలకు స్వయంగా గాని, లాయరు ద్వారా గాని హాజరై మీకుగల ఆక్షేపణలు తెలుపుకోవలసినది. లేనియడల మీపరోక్షమునతీర్మానించబడునని యిందు మూలంగా తెలియపరచటమైనది.

వాయిదా తేది-13-10-2025 ఇట్లు

యత్తపు కొండారెడ్డి
వాది తరపున న్యాయవాది
ఒంగోలు

మహారాజ శ్రీ ఒంగోలు 3వ అదనపు జిల్లా జడ్జివారి కోర్టులో
I.A.No. 127/2024
in
O.S.No.65/2024

గుడ్లూరు మల్లిఖార్జున .....పిటీషనర్
మరియు
కొంచా రాజ్యలక్ష్మి ...... రెస్పాండెంట్

To
రెస్పాండెంట్
Koncha Rajyalakshmi wife of Koncha Krishna Reddy, Hindu, aged 45 years, business, R/o. Door No.7-556/1-2, Gandhi Nagar. Chimakurthy Town-523226, Praksam District.

పై నంబరు పిటీషన్, పిటీషనర్ నీమీద కోర్టులో పిటీషన్ దాఖలు చేసియున్నందున ఈ కేసులో మీకు నోటీసు నిమిత్తం అనేక పర్యాయాలు రిజిష్టరు పోస్టుద్వారా మరియు కోర్టుద్వారా నోటీసులు పంపిననూ తీసుకొనక కాలయాపన చేయుచున్నందున ,కోర్టువారి వుత్తర్వుల ప్రకారం ఈ పేపరు ద్వారా మీకు నోటీసులు పంపడమైనది. కావున మీరు తే13-10-2025వదిన పై కోర్టువారి ఎదుట ఉదయం 10-30 గంటలకు స్వయంగా గాని, లాయరుద్వారా గాని హాజరై మీకుగల ఆక్షేపణలు తెలుపుకోవలసినది. లేని యడల మీ పరోక్షమున తీర్మానించబడునని యిందు మూలంగా తెలియపరచటమైనది.

వాయిదా తేది-13-10-2025 ఇట్లు

యత్తపు కొండారెడ్డి
పిటీషనర్ తరపున న్యాయవాది
ఒంగోలు

అతి వేగం.. నిర్లక్ష్యం..

బైక్ అదుపుతప్పి తండ్రి, మూడేళ్ల కుమార్తె మృతి

తల్లి, చిన్న కుమార్తెకు తీవ్ర గాయాలు

రేపల్లె సమీపంలో జాతీయ రహదారిపై ఘటన

ప్రజాశక్తి-రేపల్లె

అతివేగం, నిర్లక్ష్యం కారణంగా జరిగిన రోడ్డు ప్రమాదంలో తండ్రి, కుమార్తె మృతి చెందగా తల్లి మరో కుమార్తె గాయపడ్డారు. పట్టణ సమీపంలోని 216ఏ జాతీయ రహదారిపై మోటార్ సైకిల్ అదుపుతప్పి ముందు వెళుతున్న టైర్ బండిని ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. అందిన వివరాల మేరకు.. రేపల్లె పురపాలక సంఘంలో కాంట్రాక్టు ఉద్యోగిగా పనిచేస్తున్న చొక్కాకుల నాగసాయి (29) తన భార్య రాజేశ్వరి, ఇద్దరు చిన్నారులతో కలిసి బైక్‌పై మైలవరంలోని అత్తగారి ఇంటికి బయలుదేరారు. మోటార్ సైకిల్ ట్యాంక్‌పై లగేజ్ బ్యాగ్ పెట్టుకొని, ఆ బ్యాగ్‌పై ఒక పాప, వెనుక భార్య మరో పాప కూర్చొని వేగంగా వెళుతున్నారు. వేమూరు నియోజకవర్గం భట్టిప్రోలు పోలీస్ స్టేషన్ పరిధిలోని జాతీయ రహదారిపై ముందు వెళుతున్న టైర్ బండిని తప్పించే క్రమంలో ట్యాంక్‌పై ఉన్న బ్యాగ్ హ్యాండిల్‌కి పట్టడంతో బలంగా టైరు బండిని ఢీ కొట్టారు. ఈ ప్రమాదంలో నాగ సాయి అక్కడికక్కడే మృతి చెందగా, కుమార్తె చుక్కాకుల పల్లవి (3) కూడా మృతి చెందింది. భార్య రాజేశ్వరికి తీవ్రంగా గాయాలు కావడంతో రేపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్నారు. మరో కుమార్తె వేదశ్రీ (01) అపస్మారక స్థితికి చేరుకోవడంతో పట్టణంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ఈ ప్రమాదంతో పట్టణంలో విషాదఛాయలు అలముకున్నాయి. కుటుంబసభ్యులు, బంధువుల అర్తనాదాలతో ప్రభుత్వ వైద్యశాల ప్రాంగణం హృదయవిదారకంగా మారింది. నాగసాయి, పల్లవి మృతదేహాలను రేపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మృతి చెందిన నాగసాయి, పల్లవి



సంఘటన స్థలంలో పరిశీలిస్తున్న ఎస్సై ఖాదర్ బాషా

బైక్‌ను ఢీకొన్న కారు

అన్న మృతి, తమ్ముడికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-చీరాల : కారంచేడు మండలం స్వర్ణ రోడ్డులో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో అన్నయ్య అక్కడికక్కడే మృతి చెందగా, తమ్ముడు తీవ్రంగా గాయపడ్డాడు. జె.పంగులూరు మండలం, ఆర్కెట్ర వారిపాలెంకు చెందిన కొమరా బత్తిన శ్రీనివాసరావు (58), అతని తమ్ముడు శేఖర్ బాబు బంధువుల వివాహానికి హాజరై తిరిగి బైక్‌పై వస్తుండగా స్వర్ణ రోడ్డులోని టపాసుల గూడం వద్ద కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో శ్రీనివాసరావు అక్కడికక్కడే మృతి చెందగా, తమ్ముడు శేఖర్ బాబు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు 108లో క్షతగాత్రుడిని చీరాల ఏరియా ఆసుపత్రికి తరలించారు. శేఖర్ కుడి కాలుకు తీవ్రమైన గాయాలైయ్యాయి. కారంచేడు ఎస్సై ఖాదర్ భాషా ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుడు శ్రీనివాసరావుకు భార్య లుధియమ్మ, ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారు. ఈ సంఘటనతో కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. వివాహ శుభకార్యానికి తోడుగా వచ్చి తిరుగు ప్రయాణంలో అన్నయ్యను కోల్పోవడం తట్టుకోలేక తమ్ముడు కన్నీరు మున్నీరయ్యాడు.

మనీ ల్యాండరింగ్ పేరుతో రూ.1.10 కోట్లు స్వాహా

సైబర్ నేరగాళ్ల ఉచ్చులో విశ్రాంత ప్రభుత్వ వైద్యుడు

చీరాలలో ఆలస్యంగా వెలుగుచూసిన ఘరానా మోసం

ప్రజాశక్తి-చీరాల

సైబర్ నేరగాళ్లు విశ్రాంత ప్రభుత్వ వైద్యుడు నుంచి ఏకంగా దాదాపు రూ.1 కోటి 10 లక్షల నగదు దోచేశారు. మీరు కేసులో ఇరుక్కున్నారని సీబీఐ అధికారి ప్రణయ్ దయాల్ పేరుతో ఒక నకిలీ వ్యక్తి ఈ నెల 9న బాధితుడికి వాట్సాప్ కాల్ చేశాడు. మనీ ల్యాండరింగ్ కేసు నమోదు అయిందని, అందులో రూ.20 లక్షలు కమీషన్ రూపంలో మీ ఖాతాలోకి వచ్చాయి అంటూ ఆరోపించారు. దంపతులు ఇద్దరినీ 24 గంటల పాటు వీడియో కాల్‌లో ఉంచారు. పూర్తిగా నేరగాళ్ల పన్నాగంలో ఇరుక్కున్న దంపతులు ఈ నెల 11న మొత్తం రూ.1.10 కోట్లను రెండు విడతలుగా ట్రాన్స్‌ఫర్ చేశారు. తరువాత నేరగాళ్లను సంప్రదించడానికి ప్రయత్నించగా, వారి ఫోన్లు స్విచ్ ఆఫ్ కావడంతో మోసపోయామని గ్రహించారు. ఈ నెల 19వ తేదీన చీరాల పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు అందుకున్న చీరాల వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

డిజిటల్ అరెస్టులను నమ్మొద్దు : సిఐ

డిజిటల్ అరెస్టు పేరుతో వచ్చే ఫోన్ కాల్స్‌కి ఎవ్వరూ భయపడవద్దని ఒకటో పట్టణ సిఐ సుబ్బారావు అన్నారు. కేసులో మీ పేరు వచ్చింది.. సీబీఐ నుంచి మాట్లాడుతున్నాం.. అంటూ వచ్చే ఫోన్ కాల్స్‌ను నమ్మి నష్టపోవద్దని తెలిపారు. ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఖాతాదారుల బ్యాంక్ వివరాలు, డెబిట్/క్రెడిట్ కార్డు నంబర్లు, ఓటీపీలు ఎవరికీ చెప్పొద్దని సూచించారు. అనుమానాస్పద వాట్సాప్ కాల్స్ లేదా మెసేజ్‌లు వస్తే వెంటనే పోలీసులను సంప్రదించాలని కోరారు. నిజమైన సీబీఐ, ఆర్బీఐ లేదా ఇతర ప్రభుత్వ సంస్థలు ఎప్పుడూ వాట్సాప్ కాల్ ద్వారా వ్యక్తిగత వివరాలు అడగరని స్పష్టం చేశారు.

ప్రజల ఆరోగ్యానికి ప్రాధాన్యం : మంత్రి

ప్రజాశక్తి-టంగుటూరు

పేదల ఆరోగ్య సంరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి అన్నారు. తూర్పునాయుడుపాలెంలోని తన క్యాంపు కార్యాలయంలో శనివారం లబ్ధిదారులకు మంత్రి స్వామి చెక్కులు పంపిణీ చేశారు. 72 మందికి రూ. 46 లక్షల విలువైన చెక్కులు పంపిణీ చేసినట్లు తెలిపారు.

మెడికల్ కిట్లు పంపిణీ

కొండపిలోని గురుకుల పాఠశాలకు మెడికల్ కిట్టును శనివారం తూర్పునాయుడుపాలెంలోని తన క్యాంపు కార్యాలయంలో ఆయన అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ స్ట్రెచ్చర్, విద్యార్థుల ఎత్తు, బరువు కొలిచే పరికరం, శరీర ఉష్ణోగ్రత, హిమోగ్లోబిన్ కొలిచే పరికరాలు, నెబులైజర్, ఫొటోస్కోప్, టార్చ్ లైట్, తదితర పరికరాలు ఉండే ఈ కిట్టు రూ.3 లక్షలకుపైగా విలువైనదని చెప్పారు. సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లోని విద్యార్థుల ఆరోగ్య సంరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు మంత్రి చెప్పారు.

దసరా తర్వాత లాంగ్ టర్మ్ కోచింగ్

నీట్‌లో ర్యాంకు కోల్పోయిన విద్యార్థులకు దసరా తరువాత విజయవాడలో లాంగ్ టర్మ్ కోచింగ్ ప్రారంభిస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఐఐటి, నీట్ కోచింగ్ సెంటర్లను మూడు నుంచి పదికి పెంచి ఈ ఏడాది అడ్మిషన్లు చేపట్టామన్నారు. తమ శాఖ ఇప్పటికే హాస్టళ్ల బలోపేతానికి చర్యలు తీసుకున్నట్లు ఆయన వివరించారు. రూ.143 కోట్లతో మరమ్మతులు, రూ.100 కోట్లతో కొత్త భవనాల నిర్మాణానికి చర్యలు తీసుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డిసిఒ జయ, డబ్ల్యూహెచ్‌ఓ శ్రీనివాసాచారి, ఎనిమిది మంది గురుకుల పాఠశాలల ప్రిన్సిపాళ్ళు, హెల్త్ సూపర్వైజర్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



చెక్కులు పంపిణీ చేస్తున్న మంత్రి స్వామి

రైలు కింద పడి యువకుడు మృతి

ప్రజాశక్తి-శింగరాయకొండ

రైలు కింద పడి గుర్తు తెలియని యువకుడు మృతి చెందిన సంఘటన శనివారం రైల్వే స్టేషన్ పరిధిలోని పాకల రైల్వే గేట్ సమీపంలో జరిగింది. విషయం తెలుసుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పరిశీలించి ఒంగోలు తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



రైలు పట్టాలపై మృతదేహం

కొండచిలువ కలకలం

ప్రజాశక్తి-కొండపి

కొండపి నుంచి పొదిలి వెళ్లే రోడ్డులో చాణిక్య కళా శాల సమీపంలో శుక్రవా రం రాత్రి కొండచిలువ కల కలం సృష్టించింది. స్థాని కులు తెలిపిన వివరాల ప్రకారం.. రోడ్డుకు ఎడమ వైపు నుంచి రోడ్డు మీదకు వచ్చి దాదాపు రెండు గంటల పాటు కొండచిలువ అక్కడే ఉంది. రోడ్డు మీద నుంచి ప్రయాణించే వాహనదారులు కొండచి లువును తప్పిస్తూ ప్రయాణాన్ని కొనసాగించారు. కొంతసేపటి తర్వాత పక్కనే ఉన్న కళాశాల బాత్రూం వైపు వెళ్లడంతో స్థానికులు భయాందోళన చెందారు. చివరకు కొండచిలువను బయటకు తప్పించారు.

దొనకొండలో రన్నింగ్ రూమ్ ఏర్పాటుకు చర్యలు

ప్రజాశక్తి-దొనకొండ

దొనకొండలో రైల్వే ఉద్యోగులు విశ్రాంతి తీసుకునే రన్నింగ్‌రూమ్ ఏర్పాటుకు రైల్వే ఉన్నతాధికారులు చర్యలు చేపడుతున్నారని గుంటూరు రైల్వే డివిజనల్ సీనియర్ ఆపరేటింగ్ మేనేజర్ శ్రీనాథ్ వివరించారు. రైల్వేశాఖలో ఆపరేటింగ్ బ్రాంచ్ విభాగంలో పనిచేస్తున్న ఉద్యోగులకు స్థానిక రైల్వే కమ్యూనిటీ హాల్‌లో శనివారం సేఫ్టీ సెమినార్ కార్యక్రమంను నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యోగులకు విధుల్లో సేఫ్టీపై సూచనలు, ఆపరేటింగ్ విధుల్లో భద్రతకు చెందిన పలు విషయాలను వివరించారు. ఈ సందర్భంగా దొనకొండ విచ్చేసిన సీనియర్ డీవోఎం శ్రీనాథ్‌ను రిటైర్డ్ రైల్వే పింఛనర్స్ అసోసియేషన్ కార్యదర్శి జయరాజ్, వ్యాపారవేత్తలు రమేష్, గఫూర్, బిజెపీ నాయకుడు రామయ్యలు ఆయనకు శాలువా, పూలమాల వేసి సన్మానించారు. దొనకొండలో ఎక్స్‌ప్రెస్ రైళ్ల స్టాపింగ్‌కు డీవోఎం తనవంతుగా చేసిన కృషి అభినందనీయమని జయరాజ్ కొనియాడారు. ఈ కార్యక్రమంలో రైల్వే ఉద్యోగులు పాల్గొన్నారు.



సీనియర్ డీవోఎంను సన్మానిస్తున్న దృశ్యం

సామాజిక రక్షణ చట్టాన్ని తీసుకురావాలి

ప్రజాశక్తి-చీమకుర్తి

గొర్రెలు, మేకల పెంపకందారుల రక్షణకు సామాజిక రక్షణ చట్టాన్ని తేవాలని జిఎంపిఎస్ రాష్ట్ర కార్యదర్శి పూసపాటి వెంకటరావు డిమాండ్ చేశారు. శనివారం సాయంత్రం స్థానిక పంగులూరు కృష్ణయ్య భవనములో జరిగిన మండల గొర్రెల మేకల పెంపకం దారుల సంఘం చీమకుర్తి మండల కమిటీ మరియు సొసైటీ అధ్యక్షుల సమావేశానికి సంఘం మండల అధ్యక్షుడు బొడ్డు రామ్మూర్తి అధ్యక్షత వహించారు. పూసపాటి వెంకట్రావు మాట్లాడుతూ జీవాలకు అవసరమైన అన్ని మందులను ప్రభుత్వమే ఉచితంగా సరఫరా చేయాలని, ఏడాదికి నాలుగు సార్లు నట్టల నివారణ మందులు వేయాలని, ప్రమాదవశాత్తు మరణించిన జీవాలకు రూ పదివేల ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం మాజీ నాయకులు పల్లాపల్లి ఆంజనేయులు, మండల నాయకులు ఎం.ఆంజనేయులు, ఎం.శ్రీను రాఘవ, వినోదు, వెంకట్రావు, బ్రహ్మయ్య, సురేష్, రామాంజనేయులు, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ఓనర్స్‌కు ఇబ్బంది కలిగిస్తే ఫ్యాక్టరీలు బంద్

గ్రానైట్ ఫ్యాక్టరీ అసోసియేషన్ సమావేశంలో తీర్మానం

ప్రజాశక్తి-చీమకుర్తి

రాష్ట్ర ప్రభుత్వం అక్టోబర్ 1 నుంచి అమలు చేయనున్న టెన్నేజ్ సిస్టం ప్రకారం సీనరేజ్ వసూలు ప్రైవేటు కాంట్రాక్టర్కు అప్పగించడంపై గ్రానైట్ ఫ్యాక్టరీ ఓనర్స్ అసోసియేషన్ సంయుక్త సమావేశంలో చర్చించారు. శనివారం రామతీర్థం సెంటర్లోని వీటిసి సమావేశం హాలులో జరిగిన చీమకుర్తి, ఆర్‌ఎల్ పురం, బోదవాడ, ఏలూరు రోడ్డు గ్రానైట్ పాలిషింగ్ యూనిట్ల యజమానుల సంఘాల సంయుక్త సమావేశానికి ఎర్రగుంట్ల శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. నూతనంగా రాష్ట్ర ప్రభుత్వం ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని గ్రానైట్ గనుల ప్రాంతంలో అమలు చేయనున్న టెన్నేజ్ సిస్టంపై చర్చించారు. ఇప్పటికే మార్కెట్ లేక, ముడిరాయి దొరకక, స్లాబ్ సిస్టం బిల్లులు కట్టలేక అల్లాడుతున్న గ్రానైట్ పాలిషింగ్ యూనిట్ల యజమానులకు టెన్నేజీ సిస్టం మూలిగే నక్కపై తాటికాయ పడ్డట్లు అయింది. ఈ నేపథ్యంలో శనివారం జరిగిన యజమానుల సంయుక్త సమావేశం టన్ను సిస్టన్ని తీవ్రంగా వ్యతిరేకించింది. అక్టోబర్ 1 నుంచి అమలులోకి రానున్న సిస్టం వలన పాలిషింగ్ యూనిట్ల యజమానులకు ఎలాంటి ఇబ్బంది కలిగిన, నష్టం కలిగిన, భారం మోపినా తీవ్రంగా వ్యతిరేకించాలని యజమానులు అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా మూడు తీర్మానాలు ఏకగ్రీవంగా ఆమోదించారు. ప్రైవేటు కాంట్రాక్టర్లు విధించే వీధి విధానాలు పాలిషింగ్ యూనిట్లకు భారం కలిగించిన అక్టోబర్ 1 నుంచి యూనిట్లన్నీ మూకుమ్మడిగా మూతవేయాలని తీర్మానించారు. గ్రానైట్ గనులలో ఎలాంటి ముడి రాయి కొనుగోలు చేయరాదని, ప్రభుత్వానికి మైనింగ్ బిల్లులు చెల్లించరాదని ఏకగ్రీవంగా తీర్మానం ఆమోదించారు. రాష్ట్ర ప్రభుత్వం, అధికారులు పునరాలోచన చేసి పాలుషింగ్ యూనిట్లపై భారాలు మోపకుండా చూడాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో చీమకుర్తి పాలుషింగ్ యూనిట్ల యజమానుల సంఘం అధ్యక్షుడు కాట్రగడ్డ రమణయ్య, ఎస్.కె అహమ్మద్ భాష, ఆర్ ఎల్ పురం యూనిట్ల యజమానుల సంఘం అధ్యక్షుడు ఎర్రగుంట్ల శ్రీను, బోదవాడ యూనిట్ల యజమానుల సంఘం అధ్యక్షుడు లగడపాటి శ్రీనివాసరావు, ఏలూరు రోడ్డు యజమానుల సంఘం అధ్యక్షుడు సుబ్బారావు, కందిమల్ల గంగాధర్ రావు, యజమానులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాట్రగడ్డ రమణయ్య



విద్యార్థులతో అధ్యాపకులు

జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి - వేటపాలెం

మండలంలోని పందిళ్ళపల్లి జెడ్‌పి హైస్కూల్లో జరిగిన చీరాల డివిజన్ స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో వేటపాలెం జెడ్‌పి బాలికోన్నత పాఠశాల విద్యార్థులు సత్తా చాటి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. పాఠశాలకు చెందిన వైష్ణవి 100 మీటర్ల పరుగు, హై జంప్, లాంగ్ జంపులో ప్రథమ స్థానం, డిస్కస్ త్రో లో ద్వితీయ స్థానం, రోజా 200 మీటర్ల పరుగులో ప్రథమ స్థానం, 100 మీటర్ల పరుగులో ద్వితీయ స్థానం, చాందిని యోగ అండర్ 14లో, కావ్య యోగ అండర్ 17లో ద్వితీయ స్థానం, గాయత్రి హేమర్ త్రో, జావలిన్‌లలో ద్వితీయ స్థానం, సుశాంత్ చక్రి చెస్‌లో ద్వితీయ స్థానం సాధించారు. విజేతలను ప్రధానోపాధ్యాయులు దేవరకొండ సరోజిని, స్టాఫ్ సెక్రెటరీ కె సోమశేఖర్, పిఈటిలు జె దేవబిక్షం, జె శ్రావణి అభినందించారు.



పరామర్శిస్తున్న ఎమ్మెల్యే సాంబశివరావు

బాధిత కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి - పర్చూరు

ఎపి స్టేట్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్, తెలుగుదేశం మండల అధ్యక్షుడు షేక్ శంషుద్దీన్ మాతృమూర్తి రెహనాబి ఇటీవల మృతి చెందారు. ఈ విషాదం సందర్భంగా పర్చూరులోని ఆయన నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను శాసన సభ్యులు ఏలూరి సాంబశివరావు శనివారం పరామర్శించారు. రెహనాబి ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. షంషుద్దీన్ కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతూ తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో స్థానిక టిడిపి నాయకులు మక్కెన శేఖర్ బాబు, టిడిపి పట్టణ అధ్యక్షులు ఆకుల శ్రీనివాసరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కార్యదర్శి సురేష్

ముగిసిన శిక్షణా తరగతులు

ప్రజాశక్తి - భట్టిప్రోలు

స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో పంచాయతీలు సొంత ఆదాయ వనరులు సమీకరించేందుకు రెండు రోజుల శిక్షణ శనివారంతో ముగిసింది. ఎంపీపీ దావూరి లలిత కుమారి, మల్లేశ్వరరావు మాట్లాడారు. ట్రైనర్లు చెప్పిన అంశాలు పరిగణనలోకి తీసుకొని నిధులను సక్రమంగా వినియోగించుకోవాలని చెప్పారు. పంచాయతీకి ఆదాయం వచ్చేవిధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఇంచార్జ్ ఎంపిడిఒ విజయ బాబు మాట్లాడుతూ ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రాలు నిర్వహించాలని చెప్పారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్లు వక్కలగడ్డ సురేష్, దోమ ఉదయభాస్కర్ పాల్గొన్నారు.

బాపట్ల : సామాజిక వనరులు సద్వినియోగంతో పంచాయతీల ఆదాయం పెరుగుతుందని ఎంపిడిఒ జి రామకృష్ణ అన్నారు. సర్పంచులు, కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లకు శిక్షణ ఇస్తామని తెలిపారు. ప్రధానంగా గ్రామస్థాయిలోని వనరులను ఆదాయ మార్గాలుగా మలుచుకునే విధంగా నూతన ఆలోచనలకు పదులు పెట్టాలని అన్నారు. శిక్షణలో సిబ్బంది రాజు, రాణి పాత్రల వేషధారణతో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎఒ చక్రధర్, రిసోర్స్ పర్సన్లు జున్ను, మరియమ్మ, పల్నాటి శ్రీరాములు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికులకు వేతనాలు పెంచాలి

ప్రజాశక్తి - కొల్లూరు

పంచాయితీ పారిశుద్య కార్మికులకు మున్సిపల్ కార్మికులతో సమానంగా రూ.21వేల వేతనం ఇవ్వాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్ మణిలాల్ కోరారు. చెసే పనిలో తేడాలేనప్పుడు వేతనాల్లో ఎందుకు వ్యత్యాసం చూపిస్తున్నారని ప్రశ్నించారు. గ్రీన్ అంబాసిడర్ల మహాసభ స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో శనివారం నిర్వహించారు. సిఐటియు మండల కార్యదర్శి బి అగస్టీన్ జెండా ఆవిష్కరించారు. సభకు జ్యోతి, చొప్పర చెంచయ్య అధ్యక్షత వహించారు. పారిశుద్య కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలని కోరారు. ప్రభుత్వం ఇచ్చిన జిఒ 551 ప్రకారం సబ్బులు, బట్టలు, నూనె, చెప్పులు ఇవ్వాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్ రద్దు చేయాలని కోరారు. ఈనెల 27న సిఐటియు



మాట్లాడుతున్న మణిలాల్

జిల్లా మహాసభ రేపల్లెలో జరుగుతున్నందున కార్మికులు పెద్ద ఎత్తున కదలి రావాలని బి గస్టీన్ కోరారు. అనంతరం గౌరవాధ్యక్షులు బొనిగల సుబ్బారావు, అధ్యక్ష, కార్యదర్శులు చొప్పర సురేష్, కంచర్ల సుబ్బారావు, చొప్పర శ్రీనివాసరావు 17మందితో నూతన కమిటీ ఎన్నుకున్నారు.

కార్మికుల హక్కుల కోసం ఐక్య పోరాటం

ప్రజాశక్తి - బాపట్ల

కార్మిక హక్కుల కోసం ఐక్య పోరాటమే మార్గమని సిఐటియు జిల్లా కార్యదర్శి సిహెచ్ మజుందార్ అన్నారు. పట్టణంలోని పుచ్చలపల్లి సుందరయ్య ప్రజా సంఘాల భవనంలో నిర్వహించిన సిఐటియు పట్టణ 2వ మహాసభలో ఆయన మాట్లాడారు. సభకు పి పద్మవతి అధ్యక్షత వహించారు. సభలో తొలుత అమరులకు నివాళులర్పించారు. ఎనిమిది గంటల పని దినాన్ని కొనసాగించాలని కోరారు. సంక్షేమ పథకాల కోతలు, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ చర్యలు కార్మికవర్గాన్ని బలహీనపరుస్తున్నాయని అన్నారు. ప్రభుత్వాల ద్వంద్వ వైఖరి, గత పాలనలో మొదలైన కార్పొరేట్ ప్రోత్సాహక విధానాలు ప్రస్తుత టిడిపి కూటమి కొనసాగిస్తోందని విమర్శించారు. సిఐటియు



మాట్లాడుతున్న తిరుమలరెడ్డి

నాయకులు బి తిరుమలరెడ్డి మాట్లాడుతూ కొత్త కోడ్స్ ప్రకారం యూనియన్ల ఏర్పాటు కఠినతరం అవుతున్నాయని అన్నారు. కార్యక్రమంలో సిఐటియు యూనియన్ కన్వీనర్ కె శరత్, కో కన్వీనర్లు ఓలక్ష్మణరావు, కె రవి కిరణ్, ఎం కుమార్ తోపాటు మరో 18 మందిని కమిటీ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

క్రీడా కోటాలో ఖోఖో జట్టుకు ఉద్యోగాలు

ప్రజాశక్తి - పంగులూరు

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మెగా డీఎస్సీలో ఆంధ్రప్రదేశ్ చరిత్రలో ఒక క్రీడ ద్వారానే పరీక్షతో సంబంధం లేకుండా ఉద్యోగాలు కల్పించిన ఘనత తమ ప్రభుత్వానిదని పలువురు టిడిపి నాయకులు పేర్కొన్నారు. స్థానిక ఎస్ఆర్ఆర్ ఖోఖో అకాడమీ ద్వారా శిక్షణ పొంది ఇటీవల గోవాలో జరిగిన జాతీయ ఖో ఖో పోటీలో విజయం సాధించిన 15 మంది క్రీడాకారుల్లో పి శివారెడ్డి (ప్రకాశం), జి క్రాంతి కుమార్ (విశాఖపట్నం), ఎ శివ నాగిరెడ్డి (బాపట్ల), వై సతీష్ (తూర్పుగోదావరి), ఎల్ సురేష్ (విజయనగరం). ఎల్ అప్పలనాయుడు (పశ్చిమగోదావరి), వై దాలినాయుడు (కృష్ణ), పి స్వామినాథన్ (ప్రకాశం), బి లక్ష్మీనారాయణ (నెల్లూరు), కె రామ్మోహన్ (కడప), ఎ రాజ్ కుమార్ (చిత్తూరు) 11 మందికి ఉద్యోగాలు వరించాయి. వీరిని ఖో ఖో అకాడమీలో శనివారం ఘనంగా సన్మానించారు. సిఎం చంద్రబాబు, ఉప



క్రీడాకారులను సన్మానించిన దృశ్యం

ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్, క్రీడా మంత్రి మండిపల్లి రాంప్రసాద్, ఎపి స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ అనిమినీ రవి నాయుడుకు క్రీడాకారులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సిఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి లోకేష్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు రావూరి రమేష్ బాబు, డాక్టర్ బత్తుల వీరనారాయణ, రాయిని వెంకట సుబ్బారావు, కుర్ర వెంకట్రావు పాల్గొన్నారు.



విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి - అద్దంకి

మండలంలోని ధర్మవరం ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎంగా పనిచేస్తున్న సోమేపల్లి హనుమంతరావు విద్యార్థులు సులభంగా తెలుగు నేర్చుకోవడానికి 1959లో రచించిన తెలుగు వాచకాన్ని మన తెలుగు పుస్తకాల్ని విద్యార్థులకు ఉచితంగా అందించారు. పుస్తకాలను ఉపయోగించుకోవాలని ఎంఇఒ కెవి శ్రీనివాసరావు కోరారు. హెచ్‌ఎం ఊటుకూరు శ్రీనివాసులు, సుబ్బరాజు, కృష్ణారావు, విశ్వరూపా చారి, ఎస్ఎంసి చైర్మన్ ఉప్పు వెంకటరావు పాల్గొన్నారు.



చెరుకుపల్లిలో మొక్కలు నాటుతున్న అధికారులు

డస్ట్‌బిన్లు పంపిణీ

ప్రజాశక్తి - చెరుకుపల్లి

గ్రామంలో శనివారం ప్రత్యేక పారిశుద్య కార్యక్రమం నిర్వహించారు. చెత్త సేకరణకు తడి చెత్త, పొడి చెత్త ఇళ్లనుండి వేరు వేరుగా సేకరించేందుకు వీలుగా డస్ట్‌బిన్‌లు పంపిణీ చేశారు. అనంతరం గ్రామంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో రేపల్లె డిఎల్‌పిఒ పి పద్మ, తహాశీల్దారు సిహెచ్ పద్మావతి, ఇంచార్జ్ ఎంపిడిఒ శ్రీనివాసన్, వెటర్నరీ డాక్టర్ ఎం వసుంధర ప్రియాంక, పంచాయతీ కార్యదర్శి బి మల్లికార్జునరావు, తాత ఏడుకొండలు, ఎంఆర్ మూర్తి, దివి రాంబాబు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చేనేత నాయకులు సత్యనారాయణ

చేనేతలకు పథకాలు అందించాలి

ప్రజాశక్తి - భట్టిప్రోలు

నేత నేస్తున్న ప్రతి చేనేత కార్మికునికి అందించాలని ఎపి చేనేత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మురుగుడు సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఎపి చేనేత కార్మిక సంఘం కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక రైలుపేట చేనేత సహకార సంఘం ఆవరణలో జరిగిన సమావేశానికి జిల్లా ఉపాధ్యక్షులు దీపాల సత్యనారాయణ అధ్యక్షత వహించారు. చంద్రబాబు ఇచ్చిన హామీలైన 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు, ప్రతి కార్మికునికి ఏడాదికి రూ.25 వేలు ఆర్థిక సహాయం, జీఎస్టీ ఎత్తివేయాలని, త్రిఫ్ట్ ఫండ్ ప్రభుత్వ కంట్రిబ్యూషన్, సహకార సంఘాలకు రావాల్సిన బకాయిలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అక్టోబర్ 6, 7 తేదీల్లో సత్తెనపల్లిలో జరగనున్న చేనేత కార్మిక సంఘ రాష్ట్ర మహాసభల్లో చేనేత కార్మికులు పెద్ద సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు. అనంతరం అధ్యక్షులు దీపాల సత్యనారాయణ, ఉపాధ్యక్షులు ఎస్ సూర్యనారాయణ, కార్యదర్శి గొట్టుముక్కల మురళీకృష్ణ తోపాటు మరో ఏడుగురితో ప్రాంతీయ కమిటీ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో బట్టు నాగమల్లేశ్వరరావు, దొంతు కోటేశ్వరరావు, సిఐటియు నాయకులు పి మనోజ్ పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న యాజమాన్యం

ప్రతిభ చాటిన సెయింట్ ఆన్స్ విద్యార్థులు

ప్రజాశక్తి - వేటపాలెం

స్థానిక సెయింట్ ఆన్స్ ఇంజనీరింగ్ కాలేజీ విద్యార్థులు ఎంఎస్ఎంఇ ఐడియా హెకదాన్‌లో సృజనాత్మక ఆలోచనల విభాగంలో బహుమతులు సాధించినట్లు కళాశాల కార్యదర్శి వనమా రామకృష్ణా రావు, కరస్పాండెంట్ ఎస్ లక్ష్మణరావు తెలిపారు. ఇటీవల అమరావతి విట్ యూనివర్సిటి జాతీయ స్థాయిలో ఐడియా హెకదాన్‌లో పోటీలు నిర్వహించారు. పోటీల్లో తమ విద్యార్థులు బహుమతులు సాధించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కె జగదీష్ బాబు తెలిపారు. విద్యార్థులు కె వెంకట లక్ష్మి సాహితి, కె కావ్య, ఎం నందిని కుమారి, పి సల్మా, ఇసిఇ విద్యార్థులు కె లోహిత బృందం, 3వ సంవత్సరం సిఎస్ఇ విద్యార్థులు జి దీప్తి, సిహెచ్ యామిని, జివి సాయి ప్రేమ్ గణేష్, ఎబివిఎస్ ప్రవీణ్‌రెడ్డి, జి శశిధర్ బృందం అవార్డులు సాధించినట్లు డాక్టర్ పి హరిణి తెలిపారు. విద్యార్థులను డాక్టర్ సి సుబ్బారావు, మేనేజర్ ఆర్‌వి రమణమూర్తి అభినందించారు.

కౌలు రైతులకు చట్టం చేయాలి

ప్రజాశక్తి - ఇంకొల్లు

కౌలు రైతులకు న్యాయం జరిగే విధంగా నూతన కౌలు చట్టాన్ని తేవాలని, గత, ప్రస్తుత ప్రభుత్వాలు తెచ్చిన కౌలు రైతు చట్టాన్ని రద్దు చేయాలని కోరుతూ ఈనెల 22న కౌలు రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యంలో చలో అసెంబ్లీ నిర్వహిస్తున్నారు. గత ప్రభుత్వ విధానాలకు, ప్రస్తుత ప్రభుత్వ విధానాలకు తేడా లేదని రైతు నాయకులు ఆరోపించారు. 31 డిమాండ్లతో కూడిన వినతి పత్రాలు వ్యవసాయ శాఖకు, 80 మంది ఎమ్మెల్యేలు, వ్యవసాయ శాఖ మంత్రికి కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో వినతి పత్రాలు ఇచ్చారు.

నేడు వైద్య శిబిరం

ప్రజాశక్తి - ఇంకొల్లు

మండలంలోని గంగవరంలో ఆదివారం బీపీ, షుగర్ రెగ్యులర్ వైద్య శిభిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈనెల 14న జరగవలసిన వైద్య శిభిరం 21కి అనివార్య కారణాల వలన మార్పు చేసినట్లు కర్రీ బాలచంద్ర తెలిపారు. డాక్టర్ మంచాల రమేష్ కుమార్, డాక్టర్ మంచాల విద్యా, డాక్టర్ అన్నంరాజు సాంబయ్య వైద్య సేవలు అందించనున్నట్లు తెలిపారు.

యువతతోనే వికసిత్ భారత్ సాధ్యం

- నైపుణ్యాలను మెరుగుపరచుకోవాలి
- జేసీ గోపాలకృష్ణ



మాట్లాడుతున్న జేసీ గోపాలకృష్ణ

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

వికసిత్ భారత్ యువతతోనే సాధ్యమని సంయుక్త కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ సూచించారు. వికసిత్ భారత్ 2047 కార్యక్రమంలో భాగంగా ఒంగోలు శ్రీ హర్షిణి డిగ్రీ కళాశాలలో దేశ అభివృద్ధిలో యువత - మహిళల పాత్ర అనే అంశంపై శనివారం సదస్సు నిర్వహించారు. తొలుత స్వర్ణ ఆంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా కళాశాల ప్రాంగణంలో సంయుక్త కలెక్టర్ మొక్కలు నాటారు. విద్యార్థులకు మొక్కలు పంపిణీ చేశారు. తరువాత విద్యార్థులతో స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞను చేయించారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమానికి స్టెప్ సిఈఒ పి.శ్రీమన్నారాయణ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జేసీ ఆర్.గోపాలకృష్ణ మాట్లాడుతూ భారతదేశం 2047 నాటికి ప్రపంచంలోనే మొదటి ఆర్థిక శక్తిగా ఎదగటానికి చేస్తున్న కషిలో భాగంగా మేక్ ఇన్ ఇండియా, మేడ్ ఇన్ ఇండియా కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. శ్రీ హర్షిణి విద్యాసంస్థల చైర్మన్ గోరంట్ల రవికుమార్ మాట్లాడుతూ ఓ ప్రణాళిక బద్ధంగా మార్గదర్శకాలను ఏర్పాటు చేసుకొని ప్రభుత్వం విజన్ 2020 ద్వారా అభివద్ధి ఫలాలను అందుకున్నామన్నారు. రేపటి తరం కూడా ఈ వికసిత భారత్-2047 ద్వారా ఎంతో అభివద్ధి చెందాలన్నారు. డిఇఒ కిరణ్ కుమార్ విద్యార్థిని విద్యార్థులకు వికసిత భారత్ - 2047 పై అవగాహనను కల్పించారు. ఈ కార్యక్రమంలో శ్రీ హర్షిణి డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డి. ఆంజనేయులు, స్టెప్, జిల్లా యువజన సంక్షేమ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న విద్యార్థిని

సర్టిఫికెట్ల కోసం విద్యార్థిని నిరసన

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

ఒంగోలు ఎస్ఆర్ జూనియర్ కాలేజీలో సర్టిఫికెట్లు ఇవ్వక పోవడంతో ఓ విద్యార్థిని తన తల్లితో కలిసి కలెక్టరేట్ వద్ద శనివారం నిరసన తెలిపింది. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసింది. ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు వీరాస్వామి, సిహెచ్.వినోద్, రాజశేఖర్, కార్తీక్ రాజు విద్యార్థిని నిరసనకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని మాట్లాడుతూ కాలేజీలోనే పుస్తకాలు కొనాలని బలవంతం చేస్తున్నట్లు తెలిపారు. మొదటి సంవత్సరం పుస్తకాలు సీనియర్ వద్ద నుంచి తాను తీసుకున్నట్లు తెలిపారు. ఫీజు కట్టాలని డిమాండ్ చేసినట్లు తెలిపారు. పీజు చెల్లించక పోతే సర్టిఫికెట్ ఇవ్వమని, బయట చెబితే సర్టిఫికెట్ మీద 'బ్యాడ్' అని రాస్తామని బెదిరిస్తున్నట్లు ఆవేదన వ్యక్తం చేసింది. ఈ విషయాన్ని ఇప్పటికే ఆర్ఐఒ ఆంజనేయులు దష్టికి తీసుకెళ్లినా పరిష్కారం కాకపోవడంతో కలెక్టరేట్ వద్ద నిరసనకు దిగినట్లు తెలిపారు. డిగ్రీ అడ్మిషన్లు ప్రారంభమైనందున సర్టిఫికెట్లు లేక ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరాస్వామి మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం కాలేజీ ఆవరణలో పుస్తకాలు అమ్మకూడదన్నారు.కాలేజీ యాజమాన్యం పుస్తకాలు కొనుగోలుకు బలవంతం చేస్తుందని ఆరోపించారు. వెంటనే కళాశాల యాజమాన్యం పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సిహెచ్.వినోద్ మాట్లాడుతూ ఫీజు నియంత్రణ చట్టం అమలు చేయకపోవడం వల్ల కాలేజీలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులను ఒత్తిడికి గురిచేస్తున్న ఎస్ఆర్ కాలేజీపై జిల్లా అధికారులు పరిశీలన చేసి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. లేకపోతే కాలేజీ ఎదుట ధర్నా చేపడతామని హెచ్చరించారు.



కలెక్టర్‌కు పూల మొక్క అందజేస్తున్న విజయ్‌కుమార్

కలెక్టర్‌ను కలిసిన 'పెదపూడి'

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

జిల్లా కలెక్టర్ పి.రాజబాబును ఎపి మాలకార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ పెదపూడి విజయ్ కుమార్ శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. కలెక్టర్ ఛాంబర్‌లో కలిసిన విజయ్‌కుమార్ కలెక్టర్ రాజాబాబును కలిసి పూల మొక్క అందజేశారు. శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ప్రకాశం జిల్లాలోని పలు అంశాలపై చర్చించారు. ఎస్‌సి కార్పొరేషన్ ఆస్తుల పరిరక్షణ, బలోపేతంపై తీసుకోవాల్సిన చర్యలపై వారిద్దరూ చర్చించారు.

కలెక్టర్‌ను కలిసిన జర్నలిస్టులు



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న జర్నలిస్టులు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

జిల్లా కలెక్టర్ పి.రాజాబాబును పలువురు జర్నలిస్టులు శనివారం మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సత్కరి ంచారు. పుష్పగుచ్ఛాలు అంద జేశారు. ఈ సందర్భంగా జర్నలిస్టులు మాట్లాడుతూ జిల్లాకు జీవనాడి అయిన వెలిగొండ ప్రాజెక్ట్ నిర్మాణ పనులు వేగవంతం చేయాలన్నారు. గుండ్లకమ్మ ప్రాజెక్ట్ కాలువ పనులు పూర్తి చేయాలని కోరారు. పరిశ్రమల స్థాపనతో పాటు పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేయాలన్నారు. పాకల బీచ్, కొత్తపట్నం బీచ్, మాలకొండ దేవాలయం, భైరవకోన ఆలయం వద్ద మౌలిక వసతులు కల్పించాలని కోరారు. ఎయిర్‌పోర్ట్ నిర్మాణ పనులు వేగవంతం చేయాలని కోరారు. స్పందించిన కలెక్టర్ పి.రాజాబాబు మాట్లాడుతూ తాను వెలిగొండ ప్రాజెక్ట్‌ను సందర్శించానని, అవసరమైన ఆర్ఆర్ ప్యాకేజ్, పెండింగ్ నిర్మాణ పనులపై ప్రభుత్వానికి నివేదికలు పంపామన్నారు. పర్యాటక ప్రాంతాల అభివృద్ధిపై అధికారులతో సమీక్షిస్తానని తెలిపారు. జిల్లాలోని జర్నలిస్టులకు అందుబాటులో ఉంటానని, సమస్యలపై సలహాలు, సూచనలు ఇవ్వాలని కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో సూర్య దినపత్రిక బ్రాంచి మేనేజర్ గొట్టిపాటి నాగేశ్వరరావు, ప్రజాశక్తి బ్యూరో ఇన్‌ఛార్జి ఎస్‌వి బ్రహ్మం, టివి5 స్టాఫ్ రిపోర్టర్ జనార్ధన్, టివి 9 స్టాఫ్ రిపోర్టర్ ఫైరోజ్ బేగ్, 10 టివి స్టాఫ్ రిపోర్టర్ శంకర్, పి9 టివి ఎమ్‌డి పి.కిరణ్, జర్నలిస్టులు రవికిరణ్, ఎల్.రాజు, వి,కోటయ్య, దాసరి సునీల్, రాజశేఖర్, మీడియా కెమెరామెన్ అసోసియేషన్ అధ్యక్షుడు వి.నాగేశ్వరరావు, ఆంధ్రప్రభ ఫొటో గ్రాఫర్ ఏ.రాజశేఖర్ పాల్గొన్నారు.



కలెక్టర్‌తో మాట్లాడుతున్న దినకర్

కలెక్టర్‌ను కలిసిన లంకా దినకర్

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

జిల్లా కలెక్టర్ పి.రాజాబాబును 20 సూత్రాల కార్యక్రమాల అమలు చైర్మన్ లంకా దినకర్ మర్యాదపూర్వకంగా కలిశారు.కలెక్టర్ ఛాంబర్‌లో శనివారం కలిసిన లంకా దినకర్ కలెక్టర్‌ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారిద్దరి మధ్య పలు విషయాలపై చర్చ సాగింది. వెలిగొండ ప్రాజెక్టు త్వరగా పూర్తి చేసి పశ్చిమ ప్రకాశం జిల్లాలో తాగు, సాగు, పారిశ్రామిక అభివద్ధికి నీటి వసతి కల్పించాల్సిన అవసరంపై చర్చ జరిగింది, రాబోయే ఏడాది మొదటి దశ పనులు పూర్తి చేయడం ద్వారా 1.30 లక్షల ఎకరాలకు సాగునీరు, ప్రజలకు తాగునీరు అందించే లక్ష్యంతో పనులకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. కొద్ది రోజుల క్రితం అధికారులతో కలిసి తాను పశ్చిమ ప్రకాశం జిల్లాలో పర్యటించి కీర్తనల సామ్రాట్ త్యాగరాజు జన్మస్థలం కాకర్ల సందర్శించినట్లు తెలిపారు. వెలిగొండ ప్రాజెక్టుకు అనుసంధానంగా పర్యాటక కేంద్రంగా త్యాగరాజు స్మారక చిహ్నాన్ని, ఆయన కీర్తనలు ప్రదర్శనల కోసం ఆడిటోరియం నిర్మాణం చేయాలని కోరారు. కంభం చెరువు చుట్టూ ఉన్న ప్రాంతాలకు, దేవాలయాలకు పర్యాటక సర్క్యూట్ అభివద్ధి అంశాలు చర్చించారు. . ఈ అంశాలను గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి, టూరిజం కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీల సమన్వయంతో ముందుకు సాగాలని లంకా దినకర్ సూచించారు.



ముఖ్యమంత్రి నుంచి జ్ఞాపిక అందుకుంటున్న కమిషనర్

ఒంగోలు నగర పాలక సంస్థకు ప్రథమ బహుమతి

ప్రజాశక్తి - ఒంగోలు సబర్బన్

ఒంగోలు నగరపాలక సంస్థ 6.42 టన్నుల ఇ వేస్ట్‌ను సేకరించి, రీసైక్లింగ్‌కి తరలించి మొదటి స్థానంలో నిలిచింది. అందులో భాగంగా మాచర్లలో శనివారం నిర్వహించిన స్వర్ణాంధ్ర -స్వచ్ఛంద్ర, స్వచ్ఛంద్ర కార్పొరేషన్ కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ఒంగోలు నగరపాలక సంస్థ కమిషనర్ కె.వెంకటేశ్వరరావుకు ప్రశంసా పత్రం మరియు జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో పురపాలక మరియు పట్టణాభివద్ధి శాఖా మంత్రి పొంగూరు నారాయణ, పురపాలక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్ కుమార్, విద్యుత్తుశాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్, నరసరావుపేట పార్లమెంట్ ఎంపీ లావు శ్రీ కష్ణ దేవరాయలు, మాచర్ల ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి , స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కె.పట్టాభిరామ్, పల్నాడుజిల్లా అధికారులు పాల్గొన్నారు.

పరిశ్రమలు ఏర్పాటు చేయాలి

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు



మాట్లాడుతున్న కంకణాల ఆంజనేయులు

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

పరిశ్రమల పేరుతో కారిడార్లు, పారిశ్రామిక ఉత్పత్తి కేంద్రాల పేరుతో గత దశాబ్ద కాలంగా ప్రభుత్వం భూములను సేకరించిదని, ఒక్క పరిశ్రమ కూడా ఏర్పడలేదని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు విమర్శించారు. స్థానిక ఎల్‌బిజి భవన్‌లో సంఘం జిల్లా కమిటీ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ ప్రకాశం జిల్లా ఏర్పడి 55 ఏళ్ళు అయినా పరిశ్రమలు, సాగునీటి ప్రాజెక్టులు, వైద్య, విద్యా సౌకర్యాలు, రవాణా సదుపాయాలు లాంటి అంశాల్లో పెద్దగా అభివృద్ధి జరగలేదన్నారు. ఇప్పటికే సేకరించిన భూమిలో పరిశ్రమలను ఏర్పాటు చేయాలని, లేకుంటే సాగుకు యోగ్యంగా మార్చి పేదలకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. 2016లో దొనకొండ ప్రాంతంలో 24 వేల ఎకరాలు సేకరించి పరిశ్రమలు పెడతామని ప్రభుత్వం ప్రకటించినా, ఇంతవరకూ ఒక్క పరిశ్రమ కూడా స్థాపించలేదని గుర్తుచేశారు.పామూరు, పిసిపల్లి మండలాల్లో నిమ్జ్ పేరుతో 14 వేల ఎకరాలు సేకరించాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఇప్పటివరకు 1,800 ఎకరాలు సేకరించినట్లు తెలిపారు. అక్కడ కూడా ఎలాంటి పరిశ్రమల నిర్మాణం జరగలేదని వివరించారు. తాజాగా కూటమి ప్రభుత్వం రిలయన్స్ బయో గ్యాస్ ప్లాంట్ల కోసం దివాకరపల్లి, కలుజువ్వలపాడు, కురిచేడు ప్రాంతాల్లో భూసేకరణకు సిద్ధమవుతుందన్నారు. సేకరించిన భూముల్లో పరిశ్రమలను ఏర్పాటు చేయాలని, లేదంటే సాగుకు యోగ్యంగా మార్చి అర్హులైన పేదలకు పంచాలని డిమాండ్ చేస్తూ ఈనెల 24న విజయవాడలో మహా ధర్నా నిర్వహించనున్నట్లు ఆయన ప్రకటించారు. ఆ ధర్నాకు ప్రజలు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు బడుగు వెంకటేశ్వర్లు, జిల్లా నాయకులు కేజీ.మస్తాన్, వెల్లంపల్లి ఆంజనేయులు, గుమ్మా బాలనాగయ్య, ఉబ్బా వెంకటేశ్వర్లు, వేశపోగు మోజెస్, కొమ్మాలపాటి మాల్యాద్రి, మల్లెల సంపూర్ణ, కంకణాల వెంకటేశ్వర్లు, జాలా అంజయ్య, తన్నీరు సుజాత, పిల్లి కృష్ణ, అన్నవరపు శేషారావు, పి. శ్రీను, ఈదర సుబ్బారావు, కె. వెంకటమ్మ, వై. వీరనారాయణ పాల్గొన్నారు.


బీచ్‌లో పరిశుభ్రం చేస్తున్న స్కౌట్ విద్యార్థులు

బీచ్‌లో వ్యర్థాల తొలగింపు

ప్రజాశక్తి - బాపట్ల

పరిశుభ్రత వారోత్సవాల్లో భాగంగా చెరువుజమ్ములపాలెం జెడ్‌పి ఉన్నత పాఠశాల స్కౌట్ విద్యార్థులు శనివారం సూర్యలంక బీచ్‌లో ప్లాస్టిక్ వ్యర్థాలు తొలగించి తీరంలో పరిశుభ్రం చేశారు. పర్యావరణ పరిరక్షణపై బీచ్‌లో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ కార్యదర్శి తోట వెంకటరాజు, హై స్కూల్ హెచ్‌ఎం వి వెంకట కృష్ణారావు, బి రవీంద్ర బాబు, పాఠశాల స్కౌట్ మాస్టర్ బోయిన వీరచంద్ర పాల్గొన్నారు.


కషాయాలు తయారు చేస్తున్న ఎఒ మహేష్ బాబు

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

ప్రజాశక్తి - రేపల్లె


పంటల్లో తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించేందుకు రైతులు అందుబాటులో ఉన్న కషాయాలు తయారు చేసి వినియోగించాలని ఎఒ మహేష్ బాబు తెలిపారు. మండలంలోని కారుమూరులో ప్రకృతి వ్యవసాయ విభాగంలో భాగంగా బిఆర్‌సి షాప్ ఓపెనింగ్ చేశారు. ప్రకృతి వ్యవసాయ విభాగ ఇంచార్జ్ వినయ్ కుమార్ మాట్లాడుతూ పొలంలో వచ్చే చీడపీడలకు రసాయనాల బదులు ప్రకృతి కషాయాలు తయారు చేసే విధానం వివరించి చెప్పారు. విఎఎ యశస్విని, ఐసిఆర్‌పి వెంకటేశ్వర్లు, విజయలక్ష్మి, రమేష్ పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్యంతోనే ప్రగతి

ప్రజాశక్తి - వేటపాలెం

మహిళల ఆరోగ్య పరిరక్షణ కుటుంబ బలాన్ని పెంచేందుకు స్వస్థ నారీ సశక్త పరివార్ పేరుతో ప్రత్యేక ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు డాక్టర్ స్వాతి కిరణ్ తెలిపారు. మండలంలోని చల్లారెడ్డి పాలెంలో శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో పరిశీలకులు దయమని, మార్తమ్మ, సుధాకర్, అంగన్వాడి సూపర్వైజర్ సాంపత్ కుమార్, టిడిపి నాయకులు కీర్తి పూర్ణ పాల్గొన్నారు.

బాపట్ల : సుగంధ పరిమళాలు వెదజల్లే మల్లె తోటలకు ఆశించే చీడపీడల నివారించే దిశగా సస్యచిన్న కారు రైతులు సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఉద్యాన విభాగం టీచింగ్ అసోసియేట్ డాక్టర్ స్నేహ లీలా రైతులకు సూచించారు. వ్యవసాయ కళాశాల దత్తత గ్రామమైన చీరాల మండలం కావూరివారిపాలెం రైతులకు మల్లె తోటల సాగు, సస్యరక్షణ చర్యలపై అవగాహన కల్పించారు. అసోసియేట్ ప్రొఫెసర్ ఎ లలిత, అసిస్టెంట్ ప్రొఫెసర్ కె విజయ ప్రకాష్, విద్యార్థినిలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కంద్రాతి దుర్గ

హెచ్ఐవి బాధితుల పట్ల వివక్ష వద్దు

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

హెచ్ఐవి, ఎయిడ్స్ బాధితుల పట్ల వివక్ష విడనాడి వారి పట్ల ప్రేమ ఆప్యాయత కలిగి వారికి పౌష్టికాహారం, నిత్యవసర సరుకులు అందించడంలో సహకరించాలని ఫ్రెండ్స్ న్యూ జనరేషన్ కమ్యూనిటీ డెవలప్ మెంట్ సొసైటీ అధ్యక్షురాలు కంద్రాతి దుర్గ తెలిపారు. స్థానిక కార్యాలయ ఆవరణలో హెచ్ఐవి బాధితులకు అవగాహన కల్పించారు. ఎపిఎం బాచిన సురేంద్రబాబు, చిలకలూరిపేట ఐసిటిసి కౌన్సిలర్ హనుమంతరావు, డెంటల్ వైద్యురాలు భాగ్యలక్ష్మి, రవి, విహాన్, వెంకటేశ్వరమ్మ పాల్గొన్నారు.

నల్లబర్లీ పొగాకు రైతులకు అండగా ప్రభుత్వం

ప్రజాశక్తి - పర్చూరు


పొగాకు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఏలూరి, కలెక్టర్ వినోద్ కుమార్

నల్లబర్లీ పొగాకు రైతుల సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని శాసన సభ్యులు ఏలూరి సాంబశివరావు, కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్ హామీ ఇచ్చారు. స్థానిక ఎఎంసి ఆవరణంలో నల్లబర్లీ పొగాకు కేంద్రాన్ని శనివారం పరిశీలించారు. రైతుల వద్దఉన్న పొగాకును ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని చెప్పారు. సరిపడ గోడౌన్ల సౌకర్యం లేకపోవడం, ఉన్న గోడౌన్లు నిండిపోవడంతో పూర్తి స్థాయిలో కొనుగోళ్లు జరపలేకపోతున్నట్లు అధికారులు వివరించారు. సమ స్యను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి తక్షణమే చర్యలు తీసు కునేలా కృషి చేస్తామని తెలిపారు. రైతులు ఎట్టి పరిస్థి తుల్లో ఆందోళన చెందవద్దని చెప్పారు. ఎఎంసి ఛైర్మన్ గుంజి వెంకటరావు, ఆర్డిఒ పి గ్లోరియా, మార్కెటింగ్ డిఎం కరుణశ్రీ, మార్కెటింగ్ ఎడి రమేష్ బాబు, ప్రత్యేక

చీరాలలో సినిమా షూటింగ్ సందడి

ఎమ్మెల్యే కొండయ్యకు స్వాగతం పలికిన హీరో నిఖిల్

ప్రజాశక్తి - చీరాల


ఎమ్మెల్యే కొండయ్య పుష్పగుచ్ఛం అందిస్తున్న హీరో నిఖిల్

స్థానిక నగరవరం అటవీ ప్రాంతంలో స్వయంభు సినిమా ఫైనల్ షెడ్యూల్ షూటింగ్ శనివారం కొనసాగుతోంది. ఈ సందర్భంగా హీరో నిఖిల్ సిద్ధార్థ్, నిర్మాత శ్రీకర్, ప్రముఖ సినిమాటో గ్రాఫర్ కెకె సెంథిల్‌కుమార్ తోపాటు చిత్ర యూనిట్ సభ్యులను శాసన సభ్యులు ఎంఎం కొండయ్య, తెలుగుదేశం అధికార ప్రతినిధి ఎం మహేంద్రనాథ్, యువ నాయకులు ఎం గౌరీ అమర్నాథ్ ప్రత్యేకంగా కలిశారు. చిత్ర బృందానికి పూలమాలతో స్వాగతం పలికిన నాయకులు చీరాలలో షఉటింగ్ జరుగుతున్నందుకు ఆనందం వ్యక్తం చేశారు. చీరాల అటవీ ప్రాంతంలోని అందాలు తెరపై ప్రతిబింబించబోతున్నందుకు స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. స్వయంభు చిత్రం కోసం చివరి షెడ్యూల్ జరుగుతుండగా యూనిట్ సభ్యులు చీరాల వాసుల ఆతిథ్యానికి కృతజ్ఞతలు తెలిపారు. షఉటింగ్ చీరాల పట్టణానికి ప్రత్యేక గుర్తింపు తీసుకొస్తుందని సినీ అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి - చెరుకుపల్లి



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

స్థానిక జెడ్‌పి ఉన్నత పాఠశాల విద్యార్థులు అథ్లెటిక్స్ పోటీల్లో అత్యంత ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 17న పిట్టలవాని పాలెం మండలం ఖాజీపాలెం, కెవిఆర్ అండ్ ఎంకెఆర్ డిగ్రీ కాలేజీలో నిర్వహించిన బాపట్ల జిల్లా స్థాయి పోటీల్లో చెరుకుపల్లి విద్యార్థులు ప్రతిభ కనబర్చారని హెచ్‌ఎం కాటూరి లక్ష్మీనారాయణ తెలిపారు. ఈనెల 27 నుండి ఏలూరులో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. అండర్ 14లో వై దివ్యశ్రీ, తపస్విని, వర్ష లాంగ్ జంప్, హై జంప్‌లో వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు పొందారు. బాలుర విభాగంలో పి లీలా మోహన్ కృష్ణ హై జంప్, లాంగ్ జంపుల్లో ద్వితీయ స్థానం సాధించాడు. అండర్ 17 విభాగంలో టి ఉమార్షిత, వై రిషిశ్రీ హైజంప్, లాంగ్ జంపులో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించారు. ఎ దీపక్ లాంగ్ జంప్, హైజంపులో ద్వితీయ స్థానం సాధించాడు. ఎంపికైన విద్యార్థులను, పిఇటి శ్రీనివాసరావును ఎంఇఒ పి లాజర్, టి నవీన్ కుమార్, హెచ్‌ఎం కాటూరి లక్ష్మీనారాయణ అభినందించారు.

మొక్కలతోనే ..పర్యావరణ రక్షణ

ప్రజాశక్తి - అద్దంకి

మొక్కలను నాటి వాటిని పరిరక్షించే బాధ్యత ప్రతి ఒక్కరు తీసుకోవాల్సిన అవసరం ఉందని స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ చిన్ని శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని 5 వార్డు హౌసింగ్ కార్యాలయం వద్ద ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వర్ణాంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా కార్యాలయం వద్ద మొక్కలు నాటారు. కార్యక్రమంలో హౌసింగ్ కార్యాలయ బాధ్యులు కిరణ్ కుమార్, శానిటరీ ఇన్స్పెక్టర్ బలరామిరెడ్డి పాల్గొన్నారు. స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా సెప్టెంబర్ 17 నుండి అక్టోబర్ 2 వరకు వివిధ శుభ్రతా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ రవీంద్ర అన్నారు. మున్సిపల్ కార్యాలయం, సచివాలయం, కోర్టు ఆవరణలో పారిశుద్ధ్య పనులు నిర్వహించారు. పాత తహశీల్దారు కార్యాలయం, హౌసింగ్ కార్యాలయం వద్ద మొక్కలు నాటారు. టిడ్కో గృహ సముదాయం వద్ద చిల్ల చెట్లు తొలగించారు. కార్యక్రమంలో స్వచ్ఛంద్ర డైరెక్టర్ చిన్ని శ్రీనివాసరావు, శానిటరీ ఇన్స్పెక్టర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా మ్యాపింగ్ పూర్తి చేయాలి

ప్రజాశక్తి - బాపట్ల

ఓటర్ల జాబితా 2002 ప్రకారం ఓట్లను మ్యాపింగ్‌కు సంబంధించి స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పై బూత్ లెవెల్ అధికారులు పూర్తిస్థాయి అవగాహన కలిగి ఉండాలని తహశీల్దారు షేక్ సలీమా సూచించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి బూత్ లెవెల్ అధికారులతో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. ఓటర్లు జాబితా ప్రకారం మ్యాపింగ్, రివిజన్ చేయాల్సిన విధానంపై ఆమె అవగాహన కల్పించారు. ఈ మ్యాపింగ్ పారదర్శకంగా నిర్వహించాలని అన్నారు. వివాదాలకు తావులేకుండా చేయాలని చెప్పారు. ఈనెల 25లోపు ఈ ప్రక్రియ పూర్తి చేయాలని అన్నారు. సమావేశంలో మునిసిపల్ కమిషనర్ జి రఘునాథరెడ్డి, పిట్టలవానిపాలెం తహశీల్దారు వెంకటేశ్వరరావు, బాపట్ల, కర్లపాలెం, పిట్టలవానిపాలెం బిఎల్ఓలు పాల్గొన్నారు.


నిత్యావసర సరుకులు అందజేసఉతన్న ఎమ్మెల్యే కొండయ్య

కార్మికులకు సరుకులు పంపిణీ

ప్రజాశక్తి - చీరాల

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుతూ పట్టణాన్ని సుందరంగా ఉంచుతున్న పారిశుద్ధ్య కార్మికుల కృషి అభినందనీయమని శాసన సభ్యులు ఎంఎం కొండయ్య అన్నారు. స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం కొత్తపేట పంచాయతీలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మొక్కలు నాటి, పర్యావరణ పరిరక్షణకు ప్రతిజ్ఞ చేయించారు. పారిశుద్ధ్య కార్మికులకు నిత్యావసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ కౌతరపు జనార్ధన్, స్థానిక అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి - వేటపాలెం

శ్రీ రామకృష్ణ సేవా సమితి 14వ వార్షికోత్సవం సందర్భంగా శ్రీ పద్మశాలీయ బహుత్తమ కళ్యాణ మండపంలో ప్రభుత్వ, ప్రైవేటు హైస్కూల్ విద్యార్థులకు వక్తృత్వ, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పోటీల్లో జెడ్‌పి హై స్కూల్‌కు చెందిన విద్యార్థులు తెలుగు వక్తృత్వ పోటీల్లో బొడ్డు సంకేత్ కుమార్ ప్రథమ, పి మధుమిత ద్వితీయ, బి జ్ఞానేష్ తృతీయ స్థానం సాధించారు. జడ్జిలుగా ప్రతాప సాయి, డిఎస్ఆర్ ఆంజనేయులు, కె పద్మిని, వెంకట్రావు వ్యవహరించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు అక్టోబర్ 5న ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం రోజు బహుమతులు అందిస్తారు. కార్యక్రమంలో బండా శక్తిధర్, వివిఎస్ మూర్తి, కారంపూడి మధు, వేణుగోపాలరావు పాల్గొన్నారు.

హుండీ ఆదాయం లెక్కింపు

ప్రజాశక్తి అద్దంకి

మండలంలోని సింగరకొండపై వేంచేసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం నందు 15 నుండి 20 వరకు హుండీ ద్వారా వచ్చిన రూ.5.35లక్షలు సమకూరినట్లు దేవదాయ శాఖ డివిజన్ పరిశీలకులు ఎం వెంకటేశ్వరరావు, ధర్మకర్తల మండలి అధ్యక్షులు గుంజి శ్రీనివాసరావు, ఇఒ శ్రీనివాసరావు పర్యవేక్షణలో హుండీ లెక్కించారు.

విద్యార్థులను బడికి పంపాలి

ప్రజాశక్తి - అద్దంకి

తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల భాగస్వామ్యంతో విద్యార్థి అన్నివిధాలా అభివృద్ధి సాధిస్తారని ఎంఇఒ కెవి శ్రీనివాసరావు అన్నారు. ధర్మవరంలో జరిగిన ఎస్ఎంసి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉన్నత పాఠశాల హెచ్ఎం శ్రీనివాసరావు మాట్లాడుతూ తల్లిదండ్రులు శ్రద్ధవహించి రెగ్యులర్‌గా పిల్లలను పాఠశాలకు పంపించాలని కోరారు. కార్యక్రమంలో హెచ్ఎం సోమేపల్లి హనుమంతరావు, హెచ్‌పి పాఠశాల హెచ్ఎం సుబ్బరాజు, ఎస్ఎల్‌వి దేవి, ఎస్ఎంసి ఛైర్మన్ ఉప్పు వెంకటరావు పాల్గొన్నారు.

వాటర్ కూలర్ బహూకరణ

ప్రజాశక్తి - పర్చూరు

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో తహశీల్దారు కార్యాలయానికి వాటర్ కూలర్ శనివారం బహుకరించారు. రూ.10వేల విలువైన వాటర్ కూలర్ వెలనాటి వెంకట్రావు ఆర్థిక సహాయం అందించినట్లు తెలిపారు. తహశీల్దారు పి బ్రహ్మయ్య, క్లబ్ అధ్యక్షుడు తోకల కృష్ణమోహన్, ఎజి నాగభైరు శ్రీనివాసరావు, కొల్లా సుబ్బారావు, కోట శ్రీనివాసరావు, పోలిశెట్టి చంద్రశేఖరరావు పాల్గొన్నారు.

ఆటల పోటీల్లో సత్తా చాటాలి

ప్రజాశక్తి - పర్చూరు

మండల స్థాయి పోటీల్లో ఎంపికైన విద్యార్థులు డివిజన్ స్థాయిలో నిర్వహించే ఆటల పోటీల్లో సత్తా చూపాలని ఎంఈఓ1 శివ కోటేశ్వరరావు కోరారు. డివిజన్ స్థాయి ఆటల పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందించారు. అండర్ 17, 14 బాల, బాలికలకు మండల స్థాయిలో నిర్వహించిన అథలెటిక్స్ పోటీల్లో మొదటి మూడు స్థానాలు గెలుపొందారు. డివిజన్ స్థాయిలో ప్రతిభ కనపర్చి జిల్లా స్థాయికి ఎంపిక కావాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈఓ2 వెంకటరామయ్య పాల్గొన్నారు.

హరితాంధ్రప్రదేశ్ నిర్మాణంలో భాగస్వామ్యం కావాలి

- వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలి
- సింగిల్ యూస్ ప్లాస్టిక్‌ను నిషేధించాలి
- కలెక్టర్ వినోద్ కుమార్



క్లాప్ మిత్రలను సత్కరిస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్ వినోద్‌కుమార్



మొక్కలు నాటుతున్న బాపట్ల ఎంఎల్ఎ నరేంద్రవర్మ

ప్రజాశక్తి - పర్చూరు

హరితాంధ్రప్రదేశ్ నిర్మాణంకు ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్ కోరారు. స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణాంధ్ర, గ్రీన్ ఆంధ్ర కార్యక్రమంలో శాసనసభ్యులు ఏలూరి సాంబశివరావుతో కలిసి ఆయన పాల్గొన్నారు. తొలుత ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో పర్యావరణాన్ని పరి రక్షించాలని కోరుతూ మొక్కలు నాటారు. వివిధ పాఠశాలల విద్యార్థులు, వివిధ శాఖల అధికారులతో జూనియర్ కళాశాల నుండి స్థానిక బొమ్మలు సెంటర్ వరకు ర్యాలీ జరిగింది. విద్యార్థులు ప్లే కార్డులతో పారిశుధ్యం సమాజ ప్రగతికి చిహ్నం, పరిసరాలు పచ్చగా, మన జీవితాలు చక్కగా, శుభ్రత ఎక్కడుంటే ఆరోగ్యం అక్కడ ఉంటుంది, ఇంటి పరిశుభ్రత ఒంటి సుభ్రత స్వచ్ఛభారత్‌కు ఆభరణాలు అంటూ నినాదాలు చేశారు. బొమ్మలు సెంటర్లో మానవహారం ఏర్పడి స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ నిర్వహించారు. స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల్లో సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధించాలని చెప్పారు. అక్టోబర్ 2వరకు జిల్లాలో ఐదు లక్షల మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టినట్లు చెప్పారు. ఈరోజు 5వేల మొక్కలు నాటుతున్నట్లు తెలిపారు. శాసన సభ్యులు ఏలూరి సాంబశివరావు ప్రజా సమస్యలను తన దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు. ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు మాట్లాడుతూ కలెక్టర్ వినోద్ కుమార్ అంతకు ముందు అనంతపురంలో సమర్థవంతంగా పనిచేసి మంచి పేరు తెచ్చుకున్నారని చెప్పారు. మన జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించడానికి సిఎం చంద్రబాబు ఆయనను కలెక్టర్‌గా నియమించినట్లు తెలిపారు. నియోజకవర్గంలో రూ.45 కోట్ల అభివృద్ధి పనులు 95 పంచాయతీల్లో నిర్వహించామని చెప్పారు. ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా పెద్ద ఎత్తున నిధులు కేటాయించి అభివృద్ధి చేస్తుందని వివరించారు. రానున్న రోజుల్లో మరో రూ.కోటి విలువైన పనులు మంజూరు చేయాలని కోరారు. పొగాకు రైతులు అధైర్య పడవద్దని చెప్పారు. పొగాకు నిరంతరం కొంటూ ఉంటారని అన్నారు. పొగాకుతో గోదాములు నిండడంతో కొంత జాప్యం జరుగుతుందని తెలిపారు. పాఠశాల ఆవరణలో క్లాప్ మిత్ర కాఫీ విత్ కలెక్టర్, ఎమ్మెల్యే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పారిశుధ్య కార్మికులను పూలమాలలు, దుష్యాలువాతో సత్కరించారు. వేతన చెల్లింపుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. పారిశుధ్య కార్మికులు, వారి పిల్లలకు ప్రత్యేకంగా వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ఆరోగ్య పరీక్షలు చేయిస్తామని తెలిపారు. కార్యక్రమంలో డిపిఓ ప్రభాకర్, ఆర్డిఓ పి గ్లోరియా, డిఆర్డిఎ డైరెక్టర్ లవన్న, ఎంఈఓలు శివ కోటేశ్వరరావు, వెంకట్రామయ్య, డ్వామా పిడి విజయలక్ష్మి, డిఎంహెచ్ఓ విజయమ్మ, కార్పొరేషన్ డైరెక్టర్లు షేక్ సంసుద్దీన్, శ్రీహరి, ఎఎంసి చైర్మన్ గుంజి వెంకట్రావు, తహశీల్దారు బ్రహ్మయ్య, ఇన్చార్జి ఎంపిడిఓ వెంకటస్వామి, కొసన సత్యనారాయణ పాల్గొన్నారు. మండలంలోని ఉప్పుటూరు జడ్పీ హైస్కూల్లో మొక్కలు నాటారు. కార్యక్రమంలో సర్పంచ్ యర్రాకుల తిరుమలేశ్వరరావు, హెూమియో డాక్టర్ దాసరి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

బాపట్ల : పర్యావరణం పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి భావితరాలను కాలుష్య కోరల నుండి కాపాడాలని శాసన సభ్యులు వేగేశన నరేంద్ర వర్మ అన్నారు. ప్రతినెల 3వ శనివారం నిర్వహించే స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్రలో భాగంగా పట్టణంలో 3వ వార్డు రైలుపేట, రెల్లి కాలనీ ప్రాంతంలో నిర్వహించిన ప్రత్యేక పారిశుధ్య పనులు ప్రారంభించారు. ఆ ప్రాంతంలో రోడ్ల వెంట మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. డిఆర్ఓ గంగాధరగౌడ్, బుడా చైర్మన్ సలగల రాజశేఖర బాబు, మున్సిపల్ డిఇ కృష్ణారెడ్డి, కల్లు గీత కార్పొరేషన్ మాజీ చైర్మన్ తాత జయ ప్రకాష్ నారాయణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు సయ్యద్ నజీర్, సిహెచ్ కరుణ పాల్గొన్నారు.

వేటపాలెం : స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర సందర్భంగా గ్రామంలో శనివారం మొక్కలు నాటారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు నాసిక వీరభద్రయ్య, తెలుగు యువత అధ్యక్షులు కొత్త నాగరాజు, పంచాయతీ కార్యదర్శి బాలిగ సురేంద్ర, ఎఫ్ఎ జాన్సన్ పాల్గొన్నారు. స్వచ్ఛంద స్వర్ణంద్రలో భాగంగా స్థానిక టిడిపి నాయకులు కీర్తి పూర్ణచంద్ర మండలంలోని చల్లారెడ్డిపాలెంలో మొక్కలు నాటించారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, పాలపర్తి శేఖర్, బసంగారి వస్తాను, షేక్ రఫీ, శేఖర్, నారాయణ, పిన్నిబోయిన రమేషు, గవిని శీను, రాఘవ, శివ, కొమ్మన పెద్ద శీను, నారాయణ, సూర్యనారాయణ,హేమంతు, వెంకట్రావు, బొంగ ప్రసాద పాల్గొన్నారు.

రేపల్లె : పర్యావరణ సమతుల్యత కాపాడేందుకు ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని మంత్రి అనగాని సత్యప్రసాద్ సోదరులు అనగాని శివప్రసాద్ పేర్కొన్నారు. పట్టణంలోని తాలూకా సెంటర్లో శనివారం మొక్కలు నాటారు. విద్యార్థులు మానవహారంగా నిలబడి మొక్కలు నాటుతామని ప్రతిజ్ఞ చేశారు. అనంతరం శివప్రసాద్ మాట్లాడారు. భవిష్యత్ తరాలకు పచ్చని వారసత్వాన్ని అందించేందుకు మొక్కలు నటాలని అన్నారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి గూడపాటి శ్రీనివాసరావు (జి.ఎస్) మాట్లాడుతూ మొక్కలు నాటడం వల్ల మంచి వాతావరణం ఏర్పడుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీఓ రామలక్ష్మి, కమిషనర్ సాంబశివరావు, తహసిల్దార్ మోర్ల శ్రీనివాసరావు, పట్టణ సీఐ మల్లికార్జునరావు, ప్రొహిబిషన్ సిఐ దివాకర్, శానిటరీ ఇన్స్‌పెక్టర్ రామచంద్ర రావు పాల్గొన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల నందు స్వర్ణ ఆంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రవి చంద్ర కుమార్, రెడ్ క్రాస్ కో ఆర్డినేటర్ డాక్టర్ ఎం బుజ్జి బాబు పాల్గొన్నారు.

చెరుకుపల్లి : మండలంలోని కావూరు పిహెచ్‌సి పరిధిలో స్వస్థనారి సశక్త్ పరివార్ అభియాన్ నిర్వహించారు. డాక్టర్ సాలేహా జుబేదా, సమద్ వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన మందులు, సలహాలు, సూచనలు అందజేశారు. కార్యక్రమంలో ఎంఆర్‌కె మూర్తి, రాంబాబు, శ్రీనివాసరావు, సిహెచ్ఓ వాణిశ్రీ, అరుణ, శ్రీనివాస్, రాజకుమారి పాల్గొన్నారు.


కర్లపాలెం : స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణ ఆంధ్ర కొరకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని తహశీసిల్దారు షాకీర్ పాషా అన్నారు. స్వచ్ఛతా హి సేవ శనివారం నిర్వహించారు. పాఠశాల వద్ద ఎంపిడిఇఓ అద్దూరి శ్రీనివాసరావు మొక్కలు నాటారు. విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో హెచ్ఎం టి విజయ శ్రీ, జి శ్రీనివాసరావు, ఇనకొల్లు పోలీసురావు, ఫ్రాన్సిస్, సంతోష్, సుబ్బారెడ్డి, కార్యదర్శి సునీత పాల్గొన్నారు.

చీరాల : ప్రజలు ఇంటి సుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని మొక్కలు నాటుతూ పర్యావరణను కాపాడాలని టిడిపి యువ నాయకులు గౌరీ అమర్నాథ్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి నెల 3వ శనివారం నిర్వహించే స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. మున్సిపల్ కార్యాలయం నుండి ముంతవారి సెంటర్ వరకు ర్యాలి నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్డీఓ చంద్రశేఖర్, మున్సిపల్ కమిషనర్ రషీద్, మున్సిపల్ చైర్మన్ మించాల సాంబశివరావు, ఎఎంసి చైర్మన్ కౌతరపు జనార్ధన్ పాల్గొన్నారు.

మార్చురీలో ఏసి బాక్సులు లేక దుర్వాసన

ప్రజాశక్తి - బాపట్ల

స్థానిక ఏరియా వైద్యశాల పోస్టు మార్టం గదిలో మృతదేహాలు భద్ర పర్చేందుకు ఏసీ బాక్సులు లేక ఒకే బాక్సులో రెండు, మూడు మృతదేహాలు పెట్టాల్సిన దుస్థితి ఏర్పడింది. ఉన్న బాక్సులు సక్రమంగా పనిచేయకపోవడంతో పోస్టు మార్టం నిర్వహించే వరకు అవసరమైన కూలింగ్ లేక మృత దేహాలు కుళ్లిపోయి దుర్వాసన వెదజల్లుతున్నాయి. తాజాగా అస్సాం రాష్ట్రం కర్బీ ఆంగ్లో జిల్లాకు చెందిన రామ్ సోహాన్ (35) అస్సాం నుండి చెన్నైకు కూలి పనులకు రైల్లో ప్రయాణిస్తున్న తరుణంలో అప్పికట్ల సమీపంలో రైలు నుండి జారిపడి మూడు రోజుల క్రితం మృతి చెందాడు. మృతదేహాన్ని ఏరియా వైద్యశాల మార్చురీకి తరలించారు. ఇక్కడ మార్చురీలో మృతదేహాలను భద్రపర్చేందుకు ఏసీ బాక్సులు సక్రమంగా లేకపోవడంతో పోస్టు మార్టం అనంతరం కుళ్ళిపోయిన శవాన్ని తీసుకెళ్లేందుకు సైతం బంధువులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మార్చురీలో మృతదేహాలు బద్రపర్చేందుకు ఏసీ బాక్సులు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.



ఏరియా వైద్యశాల శవాగారం

మార్చురీ బాక్సులు సమకూర్చేందుకు చర్యలు

ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సిద్ధార్థ

ఏరియా వైద్యశాల మార్చురీలో ఏసీ బాక్సుల కొరత తీర్చేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని వైద్యశాల సూపర్నెంట్ సిద్ధార్థ శనివారం తెలిపారు. ఏసీ బాక్సుల కొరత నివారించేందుకు ప్రజాప్రతినిధుల సహకారంతో బాక్సులు సమకూర్చేందుకు కృషి చేస్తామని అన్నారు. అత్యవసర పరిస్థితుల్లో అనాధ శవాలను కుటుంబ సభ్యులు వచ్చేవరకు మార్చురీలోనే ఉంచాల్సిన పరిస్థితి ఏర్పడడంతో పాటు కొన్ని ప్రమాదలతో మరణాలు సంభవించినప్పుడు బాక్సులు కొరత ఉంటుందని తెలిపారు.



మెడికల్ కళాశాల వద్ద మాట్లాడుతున్న నరేంద్ర వర్మ

వైద్యశాల కళాశాల నిర్మాణం పూర్తి చేయకపోతే..

రాజకీయ సన్యాసం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - బాపట్ల

తమ ప్రభుత్వంలోనే వైద్య కళాశాల పనులు పూర్తి చేస్తామని శాసన సభ్యులు వేగేశన నరేంద్ర వర్మ అన్నారు. నిర్మాణ దశలో ఉన్న వైద్య కళాశాలను తమ పార్టీ నాయకులతో కలిసి శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వైద్య కళాశాలను 2021లో వైసిపి ప్రభుత్వం శంకుస్థాపన చేసి మూడేళ్లలో నిర్మాణాన్ని పూర్తి చేస్తామని అన్నారని గుర్తు చేశారు. ఇచ్చిన మాట నిలబెట్టుకోకపోవడంతో గడచిన ఎన్నికల్లో ప్రజలు వైసిపిని 11 సీట్లకే పరిమితం చేశారని అన్నారు. కూటమి ప్రభుత్వంలో వైద్య కళాశాల పూర్తి చేయలేకపోతే రాజకీయ సన్యాసం చేస్తానని స్పష్టం చేశారు. కళాశాల నిర్మాణంలో తొలి దశ పనులకు కేటాయించిన రూ.65 కోట్లలో కాంట్రాక్టర్‌కు రూ.20 కోట్లు మాత్రమే చెల్లించారని అన్నారు. పనులు చేసిన కాంట్రాక్టరుకు ఇంకా చెల్లించాల్సిన రూ.45 కోట్లు ఎందుకు చెల్లించలేదని ప్రశ్నించారు. వైద్య కళాశాల మొదటి విడతలో నాబార్డు నిధులు రూ.200 కోట్లకుపైగా విడుదలైతే ఆ నిధులు ఎక్కడికి వెళ్లాయని ప్రశ్నించారు.

విద్యార్థులకు దుస్తులు అందజేత

ప్రజాశక్తి - కారంచేడు

దాతలు అందించే సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంఇఓ ఎంవి సత్యనారాయణ అన్నారు. మండలంలోని ఆరు పాఠశాలల 1, 2, 3 తరగతుల విద్యార్థులకు గౌతమ బుద్ధ ఆరోవర డెవలప్మెంట్ సొసైటీ నుంచి దుస్తులు పంపిణీ చేశారు. ఒక్కొక్క విద్యార్థికి రెండు జతలు బట్టలు అందచేశారు. డాక్టర్ రాఘవయ్య విజ్ఞప్తి మేరకు హైదరాబాదుకు చెందిన స్మైల్ ఫౌండేషన్ ప్రతినిధి గేరా అనిల్ కుమార్ ఆధ్వర్యంలో దుస్తులు పంపిణీ చేసినట్లు ఉపాధ్యాయులు పావులూరు శ్రీనివాసరావు చెప్పారు. సరోజినీ, పద్మావతి, మహాలక్ష్మమ్మ పాల్గొన్నారు.

పశువులకు టీకాలు వేయించాలి

ప్రజాశక్తి - పర్చూరు

పశువులకు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని డిఎహెచ్ఓ వేణుగోపాల్ తెలిపారు. మండల కేంద్రమైన పర్చూరులో గాలికుంటు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎహెచ్ఓ మాట్లాడారు. వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం సెప్టెంబర్ 15 నుండి అక్టోబర్ 15 వరకు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎవిహెచ్ఎడి మాధవి పాల్గొన్నారు.

శక్తి యాప్‌పై అవగాహన

ప్రజాశక్తి - కొల్లూరు

శక్తి యాప్ బృందం ఎస్పీబి ఉమామహేశ్వర్ ఆదేశాల మేరకు రేపల్లె డిఎస్పి ఎ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో స్థానిక జూనియర్ కాలేజీ, దోనేపూడి జెడ్పి ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు శక్తి యాప్ పట్ల అవగాహన కల్పించారు. శక్తి యాప్ వినియోగం, గుడ్ టచ్ గురించి తెలిపారు.

నేటి నుంచి దసరా సెలవులు

ప్రజాశక్తి - యద్దనపూడి

స్థానిక డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల విద్యార్థినులకు దసరా సెలవులు ప్రకటించడంతో విద్యార్థులు శనివారం ఇళ్లకు బయలుదేరి వెళ్లారు. పిల్లలను తీసుకువెళ్ళడానికి వచ్చిన తల్లిదండ్రులుతో పాఠశాలకు వెళ్లే రోడ్డు రథిగా తయారైంది. ఆటోలు, ద్విచక్ర వాహనాలపై పిల్లలు, తల్లి, దండ్రులు రావడంతో పాఠశాల పరిసరాలు కోలా హలాంగా మారింది. అయితే పాఠశాలకు వెళ్లే రోడ్డు వర్షపు నీటితో నిండి ఉండటంతో విద్యార్థులు నానా అవస్థలు పడ్డారు. పాఠశాల రోడ్డు ఇంత అధ్వానం ఉండడం ఏమిటని తల్లిదండ్రులు ప్రశ్నించారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

గుర్తు తెలియని వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మార్టూరులో శనివారం మృతి చెందినట్లు వెలుగు చూసింది. ఎస్ఐ షేక్ సైదా కథనం ప్రకారం బ్రాందీ షాపుల సమీపంలో గుర్తుపట్టడానికి వీలులేని స్థితిలో ఉన్న పురుషుని మృతదేహం కొణిదెన రోడ్డులో ఉందని పోలీసులకు అందిన సమాచారంతో ఎఎస్ఐ మహమ్మద్ బాషా సిబ్బందితో ఘటన స్థలానికి చేరుకున్నారు. మృత దేహాన్ని పరిశీలించిన పోలీసులు మద్యం బాటిళ్లతో బాటు పురుగు మందు డబ్బాని గుర్తించారు. మూడు రోజుల క్రిందట మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. మృతదేహం మొహం పూర్తిగా గుర్తుపట్టడానికి వీలు లేకుండా ఉండటంతో అనుమానాస్పద మృతి క్రింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

రాత పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి - బాపట్ల

విద్యార్థులను ప్రోత్సహించి విద్యా ప్రమాణాలను మరింత పెంచేందుకు స్వచ్ఛంద సేవా సంస్థలు ముందుకు రావాలని రోటరీ అధ్యక్షులు వేజండ్ల శ్రీనివాసరావు అన్నారు. రోటరీ క్లబ్ కార్యదర్శి కొత్త ఆంజనేయ వరప్రసాద్ మనవడు దర్షిక్ సాయి నందన్ సౌజన్యంతో పట్టణంలోని రైలుపేట ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పరీక్షల ప్యాడ్లు, వ్రాత పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. రోటరీ డిస్ట్రిక్ట్ ప్రోత్సాహంతో కార్యక్రమాన్ని నిర్వహించినట్లు వేజెండ్ల శ్రీనివాసరావు పేర్కొన్నారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ కార్యదర్శి కొత్త ఆంజనేయ వరప్రసాద్, కొత్త సుబ్బారావు, బూర్లె రామసు బ్బారావు, జెవి కృష్ణారావు, మల్లికార్జునరావు, షేక్ మస్తాన్‌వలి, హెచ్ఎం లీలావతి, ఉపాధ్యాయులు రాజేష్ పాల్గొన్నారు.

ట్రంప్ విధానాలను తిప్పికొట్టాలి

సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు రమాదేవి

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

ట్రంప్ విధానాలను తిప్పికొట్టాలని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు డి రమాదేవి తెలిపారు. ప్రపంచదేశాలపై ట్రంప్ పెత్తనాన్ని సిపిఎం తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఆమె తెలిపారు. స్థానిక కార్యాలయంలో సిపిఎం బాపట్ల జిల్లా కార్యదర్శి సిహెచ్. గంగయ్యతో కలిసి శనివారం మీడియాతో మాట్లాడారు. అమెరికా నుంచి చమురు దిగుమతి చేసుకుంటున్నామనే సాకుతో ట్రంప్ 50 శాతం సుంకాన్ని పెంచినట్లు రమాదేవి తెలిపారు. దీంతో ఆక్వా, వస్త్ర ఫార్మా రంగాలు తీవ్ర నష్టాల బారిన పడే అవకాశం ఉందన్నారు ట్రంప్ వ్యతిరేక విధానాలకు ప్రధానమంత్రి మోడీ ఎదురు మాట్లాడే పరిస్థితి లేదన్నారు. ట్రంప్ విధానాలను సమర్థిస్తూ దేశ ఆర్థిక పరిస్థితిని పరోక్షంగా మోడీ దెబ్బతీస్తున్నారని ఆమె విమర్శించారు. ట్రంప్ విధానాలకు వ్యతిరేకంగా నిలబడి దేశంలో పరిశ్రమలు కాపాడుకోవడానికి ప్రజలు ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. ట్రంప్ విధానాలతో పారిశ్రామికంగా అభివద్ధి చెందిన ప్రాంతాలలో వస్త్ర పరిశ్రమలు తీవ్ర నష్టాల బారిన పడే అవకాశం ఉందన్నారు. ఆక్వా పరిశ్రమలు కుదేలవుతున్నాయని తెలిపారు. భారతీయ ఉత్పత్తులను ఇతర దేశాలకు ఎగుమతి చేసే అవకాశాలను కల్పించి పరిశ్రమలను కాపాడుకోవడానికి ప్రధాని మోడీ చర్యలు తీసుకోవాలని కోరారు.

గ్రానైట్ కార్మికులకు రక్షణ కల్పించాలి

ప్రభుత్వ నిర్లక్ష్యం, పరిశ్రమల యజమానులు లెక్కలేని తనంతో పొట్ట చేత పట్టుకుని ఆకలి కేకలను జయించాలని రాష్ట్రాలు దాటుకుంటూ తెలుగు రాష్ట్రాల్లో కంకర క్వారీలు, గ్రానైట్ క్వారీలలో ఉపాధిని వెతుక్కుంటూ వస్తున్న వలస కూలీల బతుకులు క్వారీలలోనే తెల్లారిపోకుండా ప్రభుత్వం రక్షణ కల్పించాలని రమాదేవి డిమాండ్ చేశారు. పారిశ్రామికంగా అభివద్ధి చెందిన గ్రానైట్ క్వారీ యాజమాన్యాలు, కంకర క్వారీల యజమానులు కనీస ప్రమాణాలు పాటించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఇటీవల ల్లికురవ సమీపంలోని గ్రానైట్ క్వారీ లో జరిగిన ప్రమాదంలో ఆరుగురు వలస కార్మికులు అత్యంత దారుణంగా ప్రాణాలు కోల్పోయారని అధికారులు వెల్లడించినట్లు తెలిపారు. వాస్తవానికి క్వారీలో జరిగిన ప్రమాదంలో ఎక్కువమంది కార్మికులు మతి చెందితే వారి వివరాలను అధికారులు పొంతన లేకుండా ప్రకటించారన్నారు. యాజమాన్యం నిర్లక్ష్యానికి అధికారుల సహకారం ఎంత తోడ్పడుతుందో స్పష్టమవుతుందని రమాదేవి విమర్శించారు.రెండు నెలలుగా గ్రానైట్ క్వారీలలో జరుగుతున్నవరస ప్రమాదాల్లో కార్మికులు ప్రమాదవశాత్తు దుర్మరణం చెందుతుంటే పొట్ట చేత పట్టుకుని వచ్చిన కూలీల మరణాలకు క్వారీల యజమానులు ఖరీదు కట్టి మతదేహాలను తరలిస్తున్నారని పరిశ్రమల యజమానులకు . కనీస ప్రమాణాలు పాటించాలని కఠినమైన ఆదేశాలు ఇచ్చే అధికారులు కరువయ్యారని విమర్శించారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి గ్రానైట్ క్వారీలలో కార్మికులకు భద్రతా చర్యలు చేపట్టేలా పరిశ్రమల యాజమాన్యాలకు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని వాటిపై అధికారులతో పర్యవేక్షణ ఏర్పాటు చేయాలనీ క్వారీలలో జరిగే ప్రమాదాలలో మతి చెందిన కార్మికులకు వయసుని బట్టి నష్టపరిహారం చెల్లించాలని రమాదేవి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి సిహెచ్ గంగయ్య,బత్తుల హనుమంతరావు, ఎనికపాటి రాంబాబు,బొడెంపూడి సూరిబాబు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రమాదేవి



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందేస్తున్న ఎస్‌పి

కలెక్టర్‌ను కలిసి ఎస్‌పి

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

బాపట్ల జిల్లా ఎస్‌పిగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన బి.ఉమామహేశ్వర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్‌ని శనివారం కలెక్టర్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. అనంతరం జిల్లాలోని పరిస్థితుల గురించి ఇద్దరూ చర్చించుకున్నారు.

అందుబాటులో యూరియా

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

బాపట్ల జిల్లాలో యూరియా పుష్కలంగా ఉందని, కావాల్సిన రైతులు సంతోషంగా తీసుకెళ్లవచ్చునని జిల్లా జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. బాపట్ల జిల్లాలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతు సేవా కేంద్రాలు, పిఎసిఎస్ కేంద్రాల ద్వారా 112 మెట్రిక్ టన్నుల యూరియాను 978 మంది రైతులకు పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. మరో 114 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉన్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు.

పొగాకు రైతులు

ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలి

బాపట్ల జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్

ప్రజాశక్తి -పర్చూరు,బాపట్ల జిల్లా

పొగాకు రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ తెలిపారు.పర్చూరు వ్యవసాయ మార్కెట్ యార్డులోని గోదామును కలెక్టర్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్కడ నిల్వ చేసిన పొగాకు బేళ్లను పరిశీలించారు. పొగాకు సాగుపై రైతులతో మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసు కున్నారు. బ్లాక్ బర్లీ పొగాకును రానున్న సంవత్సరంలో సాగు చేయవద్దని కలెక్టర్ సూచించారు. ప్రస్తుతం రైతులు ఎదుర్కొంటున్న పరిస్థితులను దష్టిలో ఉంచుకుని బ్లాక్ బర్లీ పొగాకు సాగు చేయరాదని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో రైతులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలన్నారు. ఇప్పటివరకు రూ.92 కోట్ల విలువైన 12,500 టన్నులు బ్లాక్ బర్లీ పొగాకును కొనుగోలు చేసినట్లు తెలిపారు. కొనుగోలు చేసిన పొగాకును 53 గోదాములలో నిల్వ చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం నాలుగు గోదాముల ద్వాఆరా పొగాకు కొనుగోలు చేస్తున్నామన్నారు. ఆన్ లైన్ లో నిక్షిప్తం చేసిన వివరాల మేరకు 900 టన్నుల పొగాకును కొనుగోలు చేయాల్సి ఉందన్నారు. అనధికారికంగా సుమారు 30 వేల టన్నులు పొగాకు రైతులు వద్ద ఉందని ప్రాథమిక అంచనాలు వేశామన్నారు. బ్లాక్ బర్లీ పొగాకు సాగు చేయాలని, ఏవైనా కంపెనీలు రైతులను ఒత్తిడి చేస్తున్నాయా అంటూ ఆరా తీశారు. కంపెనీల మాటలు విని రైతులు మోసపోవద్దన్నారు. రైతుల నుంచి కొనుగోలు చేసిన పొగాకు బేళ్ల నిల్వలపై ఆరా తీశారు. జిల్లాలో గోదాములు చాలక పోతే ఇతర ప్రాంతాలకు వాటిని తరలించాలన్నారు. సిఆర్‌పి సాకుగా చూపి పొగాకు బేళ్లను వెనక్కి పంపుతున్నారని రైతులు కలెక్టర్ దష్టికి తెచ్చారు. తక్షణమే చర్యలు తీసుకుంటామని రైతులకు ఆయన భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, జిల్లా మార్క్‌ఫెడ్ జిఎం కరుణశ్రీ, మార్కెటింగ్ శాఖ జిల్లా అధికారి రమేష్ బాబు, ఆర్‌డిఒ పి.గ్లోరియా, ఉప కలెక్టర్ ఎస్.లవన్న పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్

'పీపీపీ' పై ఆగ్రహ జ్వాలలు

అసంపూర్తిగా ఉన్న వైద్య కళాశాలల భవన నిర్మాణాలు, అభివృద్ధి పనులను ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యం (పీపీపీ) పద్ధతిలో పూర్తి చేయాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది. ఈ పద్ధతిలో మొదటి దశలో ప్రకాశం జిల్లా మార్కాపురం కళాశాలను, రెండో దశలో బాపట్ల మెడికల్ కళాశాల పనులు చేపట్టనున్నట్లు ప్రకటించారు. పిపిపి విధానంపై ప్రజలు, ప్రజా సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పీపీపీ పద్ధతిలో కాకుండా ప్రభుత్వ ఆధ్వర్యంలో వైద్య కళాశాలల పనులు చేపట్టాలని ప్రతిపక్ష, ప్రజాసంఘాల నేతలు, ప్రజలు కోరుతున్నార. ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను నిరసిస్తూ చలో మెడికల్ కాలేజ్ అనే కార్యక్రమానికి వైసిపి పిలుపునచ్చింది. కార్యక్రమంలో భాగంగా వైసిపి నేతలు మెడికల్ కాలేజీల వద్దకు వెళ్ళి అక్కడి వాస్తవ పరిస్థితులను ప్రజలకు వివరించే యత్నం చేశారు. అదేవిధంగా సిపిఎం, పలు ప్రజాసంఘాల నాయకులు కూడా నిర్మాణంలో ఉన్న కళాశాల వద్దకు వెళ్ళి ప్రభుత్వనిధులతో పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. టిడిపి ప్రతినిధులు, నేతలు కూడా మెడికల్ కాలేజీల దగ్గరకు వెళ్ళి గత వైసిపి ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే కళాశాలలు పూర్తి కాలేదని ఆరోపించారు. అధికార, ప్రతిపక్ష నేతల పరస్పర ఆరోపణలతో మెడికల్ కాలేజీల అంశం చర్చనీయాంశమైంది. రాష్ట ప్రభుత్వం వద్ద నిధులు లేని కారణంగా సొంతంగా వైద్య కళాశాల నిర్మాణ పనులు చేపట్టే పరిస్థితి లేదు. నూతన ఏర్పడిన బాపట్లజిల్లా కేంద్రం నిర్మించే వైద్యశాలను పీపీపీ పద్దతిలో కాకుండా ప్రభుత్వ నిధులతో నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.వైద్య కళాశాలను ప్రైవేట్ పరమైతే పేదలకు ఉచిత వైద్యసేవలు అందే పరిస్థితి ఉండదని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇప్పటికే నాలుగు పర్యాయాలు జిల్లా కలెక్టర్లతో ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రివర్గంతో కలిసి సమావేశమయ్యారు. గత వారంలోనే జిల్లా కలెక్టర్లు,ఎస్‌పిల బదిలీలు జరిగిన వెంటనే మరోసారి సమావేశం నిర్వహించిఏన జిల్లాల సమగ్రాభివృద్ధికి దిశానిర్ధేశం చేశారు. అన్ని శాఖల వారీగా సమీక్షలు జరిపారు. జిల్లాల అభివృద్ధికి కలెక్టర్లు చేయాల్సిన కృషి గురించి వివరించారు. గతంలో కూడా జిల్లాల అభివృద్ధికి కలెక్టర్లు రకాల నివేదికలు ఇచ్చారు. అయితే అసవరమైన మేర నిధులు కాకపోవడంతో పలు అభివృద్ధి ప్రణాళికలు ప్రతిపాదనలకే పరిమితం. అయ్యాయి. ఉపాధ్యాయులు, ఉద్యోగుల సమస్యలు పరిష్కరిం చాలని కోరుతూ యుటిఎఫ్ రణభేరి జాతా చేపట్టింది. ఈ జాతా ప్రకాశం, బాపట్ల జిల్లాల్లో పలు ప్రాంతాల మీదుగా సాగింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలలు గడుస్తున్నప్పటికీ ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించకపోవడంతో రోడ్డు ఎక్కాల్సిన పరిస్థితి ఏర్పడిందని సంఘ నేతలు ఈ సందర్భంగా ధ్వజమెత్తారు. బోధనేతర కార్యక్రమాలు రద్దుచేయాలని, ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలని, అస్తవ్యస్తంగా, పునర్వ్యవస్థీరించిన పాఠశాలల వ్యవస్థను సరిదిద్దాలని, పేరుకుపోయిన వేల కోట్ల ఆర్థిక బకాయిలను చెల్లించాలని కోరారు.పెండింగ్ లో ఉన్న నాలుగు డిఎలను వెంటనే మంజూరు చేయాలని, 12వ పిఆర్‌సి ప్రకటించాలన్నారు. అంత వరకూ 29 శాతం మధ్యంతర భతిని ఇవ్వాలన్నారు. సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షను విధానాన్ని అమలు చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం స్పందించి ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వం, అధికారులు హెచ్చరిస్తున్నా ఎరువుల బ్లాక్ మార్కెట్ నడుసోంది. ముఖ్యంగా యూరియా దారి మల్లుతోంది. రైతులకు మద్దతుగా వైసిపి ఆధ్వర్యంలో పోరుబాట కార్యక్రమం నిర్వహించారు. రైతులకు సకాలంలో అందాల్సిన ఎరువులను బ్లాక్ మార్కెట్ తరలించడాన్ని ప్రతిపక్ష నేతలు, ప్రజాసంఘాల నాయకులు తీవ్రంగా ఖండించారు. ప్రభుత్వం ఎరువుల కొరత లేకుండా చూడాలని డిమాండ్ చేశారు. రైతులకు అవసరమైన మేర ఎరువులు, యూరియా వెంటనే అందజేయాలని కోరారు. రైతులు యూరియా కోసం ఆందోళనలు చేస్తున్న క్రమంలో తాడేపల్లి సచివాలయంలో యూరియా పంపిణీపై బాపట్ల జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కొలుసు పార్ధసారధి, రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్య ప్రసాద్, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌లు, జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ సమీకా సమావేశం నిర్వహించారు. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకూ మండలాల వారీగా యూరియా పంపిణీ కి సంబంధించిన వివరాలను మంత్రులు పరిశీలించారు ఖరీఫ్‌లో వారం వారం ఎంత మేర యూరియా అవసరం అవుతుందో దాని ప్రకారంగా మండల వారిగా రైతుల ఆధార్ అను సంధానంతో జిల్లాలో రైతులకు అవసరమైన యూరియా పంపిణీ చేయాలని సూచించారు. బాపట్ల సూర్యలంక బీచ్‌లో ఈ నెల 26 నుంచి 28 వరకు మూడు రోజులపాటు బీచ్ ఫెస్టివల్ నిర్వహిస్తున్నారు. ఈ మేరకు రాష్ట్ర సచివాలయంలో రాష్ట్ర మంత్రులు కొలుసు పార్ధసారధి, కొల్లు రవీంద్ర, అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్‌తో కూడిన మంత్రుల బందం సూర్యలంక బీచ్ ఫెస్టివల్ నిర్వహణ ఏర్పాట్లపై సంబందిత శాఖల అధికారులతో సమావేశమై సమగ్రంగా చర్చించి పలు ఆదేశాలు జారీ చేశారు. ప్రపంచ పర్యాటక దినోత్సవ వేడుకల అనుసంధానంగా నిర్వహించబడుతున్న నేపథ్యంలో ఈ వేడుకలను విజయవంతంగా నిర్వహిం చేందుకు చర్యలు చేపట్టారు. పర్యాటకులు, సందర్శకులకు ఆహ్లాదం కలిగించే విధంగా క్రీడలు, క్రీడా సదుపాయాలు, సాహస క్రీడలు, ఎగ్జిబిషన్, లేజర్ షో, సాంస్కతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ నెల 27న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూర్యలంక బీచ్‌ను సందర్శించి రూ.97 కోట్ల అభివద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారు.

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా